# విశాల భారతి

19-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 349




## రేవంత్ రెడ్డికి భయం మొదలైంది

- మెదక్ సర్పంచ్‌ల అభినందన సభలో హరీష్ రావు పాల్గొన్నారు
- ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు
- పంచాయతీ ఫలితాలు సీఎం రేవంత్‌కి చెంపపెట్టు అన్నారు
- ఎన్నికలలో 80శాతం ఫలితాలు సాధించాలని వెల్లడించారు
- పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో అడ్డగోలు వ్యవహారాలు చేశారు
- కాంగ్రెస్ 50శాతం విజయాలు మాత్రమే సాధించిందని తెలిపారు
- సర్పంచ్‌ల ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తున్నాయని పేర్కొన్నారు
- దెబ్బతో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలు పెట్టే ధైర్యం చేయడన్నారు

02

### భారత్‌ఒమన్ మధ్య

## ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్

- ప్రధాని నరేంద్ర మోదీ ఒమన్‌లో పర్యటించారు
- మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను పురస్కారాం ప్రదానం చేశారు
- సుల్తాన్ హైతమ్ స్వయంగా మోదీకి అందించారు
- రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు 70 ఏళ్లు పూర్తి
- సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టనున్నాయి
- సుమారు 12 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోంది



**విశాలభారతి, నేషనల్:**

భారత్ ఒమన్ సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించినందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేశారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఈ గౌరవం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. సుల్తాన్ హైతమ్ స్వయంగా ఈ పురస్కారాన్ని ప్రధాని మోదీకి అందించారు. భారత్‌ఒమాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో మోదీ చూపిన దూరదృష్టి, నాయకత్వం, పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు చేసిన కృషిని గుర్తిస్తూ ఈ అవార్డు ప్రదానం చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. భారత్-ఒమాన్ మధ్య 1950లలో ప్రారంభమైన దౌత్య సంబంధాలు ఏడు దశాబ్దాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా మోదీ పర్యటనకు

మిగతా 2లో..

## 2029లో కూడా ఇదే రిపీట్:

# సీఎం రేవంత్



- పంచాయతీల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం
- ఫలితాలు రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు మద్దతుగా భావిస్తున్నాం
- బీఆర్ఎస్, బీజేపీ 33శాతం విజయం మాత్రమే సాధించాయన్నారు
- ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించి ఆశీర్వదించారు
- అహంకారంతో విర్రవీగితే ప్రజలకు మరింత దూరం అవుతారు
- గజ్వేల్ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని తిరస్కరించారు
- కేటీఆర్ వెనుక గోతులు తీసే పనిలో హరీష్ రావు ఉన్నారు

తెలంగాణలో జరిగిన 12,702 గ్రామ పంచాయతీల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 8,335 సర్పంచ్ స్థానాలను గెలుచుకుని 66శాతం విజయాలు నమోదు చేసిందని..ఈ ఎన్నికల ఫలితాలు రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు మద్దతుగా ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ 3511, బీజేపీ 710స్థానాలు సాధించాయని, ఆ రెండు పార్టీలు కలిసి 33శాతం విజయం మాత్రమే సాధించాయన్నారు. సీపీఐ, సీపీఎం లు 146సర్పంచ్ లతో 1శాతం విజయం సాధించాయని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించి ఆశీర్వదించారన్నారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఒక్క సీటు గెలవలేదని.. ఆ తర్వాతా రెండు ఉప ఎన్నికల్లోను ప్రజలు మమ్మల్ని గెలిపించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో 94నియోజకవర్గాల్లో జరిగిన గ్రామపంచాయతీలో ఎన్నికల్లో 66శాతం విజయాలు సాధించిందని, కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం పరిధిలో సైతం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలిపించి..కేసీఆర్ ను తిరస్కరించారన్నారు. ఈ విజయాలన్ని మా రెండేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనకు మద్దతుగా ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నామని తెలిపారు. మేం అమలు చేసిన ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాల అమలుకు లభించిన ఆదరణను ఎన్నికల ఫలితాలు చాటుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ, 61వేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకం, టీచర్ల నియామకాలు, పేదలకు నాణ్యమైన విద్య కారణంగా ప్రజలు మా పాలనను ఆశీర్వదించారన్నారు. సన్న బియ్యం, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్ వంటి కేసీఆర్ చేయలేని పనులు చేస్తున్నామన్నారు. ఆదాయాన్ని, అప్పులను గాడిలో పెట్టుకుంటూ వాటిని అమలు చేస్తున్నామని.. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అమలు చేస్తు ముందు కెలుతున్నామని, ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీగా స్వేచ్ఛగా వ్యవహారించే ప్రజాస్వామిక వాతావరణం అమలు

మిగతా 2లో..

## 'జీ రామ్ జీ'పై గరం గరం..!



- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు
- ఆ స్థానంలో వికసిత్ భారత్ రోజ్ గార్ ఆజీవికా హామీ మిషన్ గ్రామీణ్
- లోకసభలో విపక్షాల నిరసనల మధ్యే వీబీ జీ రామ్ జీ బిల్లుకు ఆమోదం
- వెల్‌లోకి వచ్చిన విపక్ష సభ్యులు బిల్లు ప్రతులు చించి విసిరేశారు
- వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లారు

**విశాలభారతి, నేషనల్:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' స్థానంలో కేంద్రం కొత్తగా తీసుకొస్తున్న 'వికసిత్ భారత్ రోజ్ గార్ ఆజీవికా హామీ మిషన్ గ్రామీణ్' బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాల నిరసనల మధ్యే వీబీ జీ రామ్ జీ బిల్లుకు ఆమోదం లభించింది. ఆమోద సమయంలో వెల్‌లోకి వచ్చిన విపక్ష

మిగతా 3లో..

## ఇలాంటి బతుకు కంటే చావడమే మేలు

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- మాజీ స్పీకర్ పోచారంని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు
- 75 ఏళ్ల వయసులో కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ బెంచీల్లో కూర్చోవడం ఆయన పతనానికి నిదర్శనం
- సర్పంచ్‌ల ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తున్నాయని పేర్కొన్నారు
- గజ్వేల్ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని తిరస్కరించారు
- పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది

03



## భాగ్యనగరంలో డేంజర్ బెల్స్

- హైదరాబాద్‌లో వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది
- గాలి నాణ్యత సూచిక ఏకంగా 220 స్థాయికి చేరింది
- ప్రమాదకర ధూళి కణాల పరిమాణం విపరీతంగా పెరిగిపోయాయి
- వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రోగులకు తీవ్ర ఇబ్బందులు
- గాలి నాణ్యత సూచిక 50 లోపు ఉంటే ఆరోగ్యకరం
- ఇప్పుడు 200 దాటడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది
- మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థితికి చేరుకుంది




**విశాలభారతి, స్టేట్ బ్యూరో :** హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఏకంగా 220 స్థాయికి చేరుకోవడంతో భాగ్యనగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గాలిలో పీఎం 10, పీఎం 2.5 వంటి ప్రమాదకర ధూళి కణాల పరిమాణం విపరీతంగా పెరిగిపోవడంతో వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రోగులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా గాలి నాణ్యత సూచిక 50 లోపు ఉంటే ఆరోగ్యకరమని, 100 వరకు ఉంటే ఫర్వాలేదని భావిస్తారు. కానీ ఇప్పుడు 200 దాటడం

మిగతా 2లో..

## 20 ఏళ్ల నిరీక్షణకు తెర

- రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది
- రూ.15 వేల కోట్ల విలువ చేసే భూములపై చారిత్రాత్మక తీర్పు
- 102 ఎకరాల భూమి అటవీశాఖకు చెందుతుందని స్పష్టం
- యాజమాన్య హక్కుల కోసం గత 20 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం
- భూమి తమదేనని 260 మంది న్యాయస్థానాలను ఆశ్రయించారు
- భూమిని అధికారికంగా రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని ఆదేశించింది

04





## 'ఒక్కొక్కరి తాటతీస్తాం'

- తెలంగాణ రాష్ట్రంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది
- బీజేపీ కార్యాలయాల ముందు కాంగ్రెస్ భారీ ధర్నాకు దిగింది
- రాజకీయ కక్ష సాధింపు చేస్తోందని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం
- నేషనల్ హెరాల్డ్ కేసు దీనికి అద్దం పడుతోందన్నారు
- దీనిపై బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు
- కార్యాలయాలను ముట్టడిస్తే చూస్తూ కూర్చోమన్నారు
- ఒక్కొక్కరి తాటతీస్తామని రామచందర్ రావు అన్నారు
- ధ్వంసం చేయడాలు మంచి సంస్కృతి కాదని వెల్లడించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చేస్తోందని కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసు దీనికి అద్దం పడుతోందన్నారు. అంతేకాకుండా ఇటీవల జాతీయ ఉపాధి హామీ పథకం మార్చడంలో కూడా బీజేపీ కావాలనే గాంధీ పేరును తొలగించిందని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం దేశవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాల ముందు కాంగ్రెస్ నేతలు భారీ ధర్నా చేపట్టారు. తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా హైటెన్షన్ నెలకొంది. ఈ విషయం తెలిసిన వెంటనే బీజేపీ కార్యాలయాల వద్దకు భారీ సంఖ్యలో పోలీసులు చేరుకుని, భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ వ్యాప్తంగా ధర్నా నిర్వహించాలని

మిగతా 2లో..

# రేవంత్ రెడ్డికి భయం మొదలైంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటివని బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీష్ రావు అన్నారు. మెదక్ జిల్లా నూతన గ్రామ సర్పంచ్‌ల అభినందన సభలో హరీష్ రావు మాట్లాడారు. అధికార పార్టీ సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలలో 80శాతం ఫలితాలు సాధించాలని, గతంలో బీఆర్ఎస్ ఆ స్థాయిలో విజయాలు సాధించిందన్నారు. కాని ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎన్ని అడ్డగోలు వ్యవహారాలు చేసినా..అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 50శాతం విజయాలు మాత్రమే సాధించిన తీరు ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల దెబ్బకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పట్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే ధైర్యం చేయడన్నారు. పార్టీ సింబల్ తో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కారు గుర్తు చూస్తే కేసీఆర్ గుర్తొస్తాడన్న భయం రేవంత్ రెడ్డికి ఉందని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు రానున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంకేతం అని హరీష్ రావు స్పష్టం చేశారు. రెండేళ్ల పిదప రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం రాబోతుందన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలన కాలంలో రైతులను మోసం చేస్తు ఇబ్బందుల పాలు చేస్తుందని టి.హరీష్ రావు విమర్శించారు. యూరియా సరఫరా చేయడం చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం యాప్ లు,



మ్యాప్ లు అంటూ దొంగ నాటకాలు ఆడుతుందన్నారు. రైతులు వ్యవసాయం చేయాలా యాప్ చుట్టూ, మ్యాప్ చుట్టూ తిరగాలా అని ప్రశ్నించారు. రైతులకు కావాల్సింది యూరియా, నీళ్లు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం యాప్‌లు, మ్యాప్‌లు కావన్నారు. వాన కాలంలో యూరియా సరఫరా చేయలేకపోయిన కాంగ్రెస్, యాసంగిలో కూడా అదే పరిస్థితి తెచ్చేలా కనబడుతుందని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నాలుగు సార్లు రైతు భరోసా సహాయం అందించాల్సి ఉండగా..రెండు రైతు భరోసా డబ్బులు రేవంత్ రెడ్డి ఎగవేశాడని ఆరోపించారు. యాసంగి పంట సాగులో రైతులకు పెట్టుబడి సహాయం ఇవ్వాల్సిన ప్రభుత్వం పంట వేసినోళ్లకే రైతు భరోసా అంటూ కప్పదాట్లు వేస్తుందని హరీష్ రావు విమర్శించారు. యాసంగి రైతు భరోసాను పంటలు సాగు చేసినోళ్లకే ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి లీకులు ఇస్తున్నాడని, తెలంగాణలో 50 నుండి 60 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారని, పత్తి రైతులు ఒక పంటనే వేస్తారని, తోటలు, పప్పుదినుసులు, మొక్కలు, పసుపు, ఉల్లి, చెరుకు సాగు చేసే రైతులకు యాసంగి రైతు బంధు వేయరా? అని హరీష్ రావు నిలదీశారు.

రైతు రుణమాఫీ కూడా అందరికి అమలు కాలేదన్నారు. పంట బోనస్ 1800కోట్లు పెండింగ్ లో ఉందన్నారు. రైతు హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా ఫెయిలైందని విమర్శించారు. మరోవైపు ఘనపురం రైతులు సాగు నీటి విడుదల జరుగుతుందో లేదో తెలియక అయోమయంలో ఉన్నారన్నారు. కౌలు రైతులకు కౌలు ఇచ్చినట్లు రాసిస్తే అప్పుడే యూరియా ఇస్తానని ప్రభుత్వం చెబుతుందని, దీంతో భూ యజమానులు కౌలు ఇవ్వడమే బంద్ చేస్తారని, దీనివల్ల లక్షలాది మంది కౌలు రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే యాప్ లు బంద్ చేసి రైతులందరికి యూరియా సరఫరా చేయాలని, రుణమాఫీ డబ్బులు అందరికి ఇవ్వాలని, వరి బోనస్ 1800కోట్లు విడుదల చేయాలని, యాసంగి పంట రైతు భరోసా డబ్బులను వెంటనే షరతులు, కోతలు లేకుండా తక్షణమే విడుదల చేయాలని, మెదక్ ఘనపురం ఆనకట్టు రైతులకు నీటి విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. మెదక్ జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు పరిధిలో ఉన్న రైతులు ప్రస్తుతం యాసంగి పంట సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ మరమ్మత్తుల పేరుతో ప్రభుత్వం నీటిని పూర్తిగా ఖాళీ చేయడం వల్ల రైతులు అగమ్యగోచర స్థితిలో పడిపోయారని ఆయన విమర్శించారు. ఒకవేళ ప్రభుత్వం సకాలంలో ఈ పనులను పూర్తి చేసి ఉంటే, నేడు యాసంగి సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు అని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం నీటి విడుదలపై సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారని, వేల ఎకరాల ఆయకట్టు ప్రమాదంలో పడే అవకాశం ఉందని హరీష్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సింగూరు మరమ్మత్తుల ప్రస్తుత స్థితిని, యాసంగి సాగుకు నీటిని ఎలా అందిస్తారో రైతులకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేసి, సాగు నీటి కష్టాలు తలెత్తకుండా చూడాలని మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని కోరారు.

## భారత్‌ఒమన్ మధ్య ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్

( మొదటిపేజీ తరువాయి )

ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. రెండు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధనం, సముద్ర భద్రత, సాంస్కృతిక మార్పిడి వంటి రంగాల్లో సహకారం మరింతగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ గౌరవం ప్రతీకాత్మకంగా నిలిచింది.

భారత్‌ఒమాన్ ద్వైపాక్షిక సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టనున్నాయి. మస్కట్ పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఒమాన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పై కీలక చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ, ఇంధన, సముద్ర భద్రత రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. భారత్-ఒమన్ మధ్య ప్రస్తుతం సుమారు 12 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోంది. ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తే ఈ సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా భారతీయ ఔషధాలు,వ్యవసాయ ఉత్పత్తులు,ఇంజనీరింగ్ వస్తువులు, పెట్రోకెమికల్స్ వంటి రంగాలకు భారీగా లాభం చేకూరనుంది. ఒమాన్, భారత సముద్ర భద్రతా వ్యూహంలో కీలక భాగస్వామి. అరేబియా సముద్రం, హోర్ముజ్ జలసంధి ప్రాంతాల్లో స్థిరత్వం కోసం ఇరుదేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. రక్షణ రంగంలో సంయుక్త విన్యాసాలు, నౌకాదళ సహకారం మరింత పెరగనున్నాయి. ఒమన్‌లో సుమారు 7 లక్షల మంది భారతీయులు పనిచేస్తున్నారు. వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు చర్చించాయి. వీసా సౌకర్యాలు, కార్మిక ఒప్పందాల సరళీకరణపై ఒమన్ సానుకూలంగా స్పందించినట్లు వర్గాలు తెలిపాయి. అంతకుముందు మస్కట్‌లో ప్రధాని మోదీకి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. సుల్తాన్ హైతమ్‌తో జరిగిన సమావేశం అనంతరం మోదీ, ఒమాన్ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ ఇరుదేశాల మధ్య శతాబ్దాల నాటి బంధం మరింత బలపడుతోంది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ చెవికి రింగ్ పెట్టుకున్నట్టుగా ఉన్న కొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. అది చెవిరింగే అని చాలా మంది భావించారు. నరేంద్ర మోదీపలు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు స్థానిక వేషభాషలను స్థానికులను ఆశ్చర్యపరుస్తుంటారు. ఈ క్రమంలో ఒమన్ టూర్ లో కూడా అలాంటిదే జరిగి ఉంటుందని చాలా మంది భావించారు. అయితే, అసలు మోదీ పెట్టుకున్నది చెవి రింగు కాదు. నరేంద్ర మోదీ విమానం దిగినప్పటి వీడియోలు, ఇమేజ్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. అది చెవి రింగ్ కాదు ట్రాన్స్ లేటర్ అని. ఔను. అది ట్రాన్స్ లేటరే. కాకపోతే చెవికి దగ్గరగా పెట్టుకోవడం, తెల్లగా ముత్యంలా మెరుస్తుండడంతో అది చెవికి ముత్యపు పోగు పెట్టుకున్నట్టుగా వీడియోల్లో కనిపిస్తుంది. ఒమన్ లో అరబిక్ మాట్లాడతారు. దీంతో స్థానికులు ఏం మాట్లాడారో ఎప్పటికప్పుడు ట్రాన్స్ లేట్ అయ్యి వెంటనే మనకు తెలిసిన భాషలో వినిపిస్తుంది.

## 2029లో కూడా ఇదే రిపీట్: సీఎం రేవంత్

( మొదటిపేజీ తరువాయి )

చేస్తున్నామన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. అహంకారంతో విర్రవీగితే ప్రజలకు మరింత దూరం గ్రామపంచాయతీ ఎన్నికలు కూడా పూర్తి స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక వాతావరణంలో జరిగాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గెలిస్తే ఆహంకారం, ఓడితే కుంగిపోవడం వంటి వాటికి దూరంగా ప్రజలకు దగ్గరగా ఉండాలనే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎన్నికల ఫలితాలు మా బాధ్యతను పెంచాయన్నారు. 2029లో కూడా ఇదే తీర్పు పునరావృతమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, అహంకారాలను తగ్గించుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రతిపక్ష పార్టీగా బాధ్యతగా సహకరించాలన్నారు. అధికారం పోయిన కొందరికి అహంకారం తగ్గడం లేదన్నారు. బరితెగించి ఇబ్బంది పెడుతామంటే వారు మరింతగా ప్రజలకు దూరమవుతారన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలకు ప్రభుత్వం పట్ల ఉన్న అసూయ, ద్వేషం మూసీ కాలుష్యం కంటే ఎక్కువగా ఉందని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ పథకంను పేరు మార్పు, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై అక్రమ కేసులతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వైఖరిని ప్రజలు నిరసిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు. అంతర్జాతీయంగా 3లక్ష



ల88లవే తలసరి ఆదాయంతో తెలంగాణ పురోగమిస్తుందన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చించి ప్రతిపక్షాల అభిప్రాయాలు తీసుకుని నిర్ణయం తీసుకుంటామని.. 42శాతం బీసీ రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలన్నదానిపై ప్రతిపక్షాల అభిప్రాయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

**అనర్హత నిర్ణయంపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

అసెంబ్లీ సమావేశాల్లో 37మంది ఎమ్మెల్యేలు మాకు ఉన్నారని..ఆ మేరకు మాకు ఇంత సమయం కావాలని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావు అడిగారని..అంటే ఆ పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే వారు భావిస్తున్నట్లే కదా అని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతినెల బీఆర్ఎస్ పార్టీకి ఆ పది మంది ఎమ్మెల్యేలు రూ.5వేలు చెల్లిస్తున్నారని, ఆ పది మంది ఎమ్మెల్యేల తరపునా మాట్లాడేందుకు సమయం, జీతాల్లో వాటాలు కావాలంటునే వారు మా పార్టీ వారు కాదని బీఆర్ఎస్ వాళ్లు మాట్లాడం విడ్డూరంగా ఉందని చురకలేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలను మా వాళ్లు కాదని చెప్పుకునే దుస్థితి రావడం విడ్డూరమన్నారు. కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరని భావించి గజ్వేల్ నియోజకవర్గం ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మెజార్టీ స్థానాలు కట్టబెట్టారని, రేపు ఆయనతో ఇంకేదో అవుతుందనుకోవడం భ్రమే అని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ప్రతిపక్ష నేతగా లేఖ రాస్తే.. కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి పదేళ్ల వారి పాలనలో, రెండేళ్ల మా పాలనలో తీసుకున్న నిర్ణయాలు, సాధించిన హక్కులపైన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు పెట్టి రెండు మూడు రోజులైన చర్చిద్దామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రం పాలకుల కంటే కూడా ఎక్కువగా తెలంగాణకు అన్యాయం చేసిందే కేసీఆర్ అన్నారు. బురద చల్లి పారిపోతామంటే ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. కేటీఆర్ అనే వ్యక్తి ఇవ్వాళ కాంగ్రెస్ గూర్చి ఆలోచన చేయడం లేదని, హరీష్‌రావు తన వెనుక తీస్తున్న గోతుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నం చేసే పనిలో ఉన్నాడని రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. కేటీఆర్ నాయకత్వంతో పార్టీ మనుగడ కష్టమని, హరీష్ రావుకు నాయకత్వం అప్పగించాలని ఆ పార్టీ నాయకులు అంటున్నారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

## భాగ్యనగరంలో డేంజర్ బెల్స్

( మొదటిపేజీ తరువాయి )

తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నగరంలోని బొల్లారం, పటాన్‌చెరు, హెచ్‌సీయూ, సోమాజిగూడ, జూపార్కు వంటి ప్రాంతాల్లో కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సనత్‌నగర్, మలక్‌పేట, నాచారం, కోకాపేట వంటి మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత సంతృప్త స్థాయి నుంచి ప్రమాదకర స్థితికి చేరుకుంటోందని హెచ్చరించింది. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ).. ఒక్క రోజు కూడా నాణ్యమైన గాలి (గుడ్ ఎయిర్) లేదని నివేదికలు చెబుతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో డిసెంబరు నెల వాయు కాలుష్యం (ఏక్యూఐ) పరిశీలిస్తే.. ఈ ఏడాది డిసెంబర్‌లో అత్యధిక స్థాయిలో నమోదు అవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణాల ప్రకారం ఏక్యూఐ 50 లోపు ఉంటే స్వచ్ఛమైన గాలిగా పేర్కొంటారు. అయితే హైదరాబాద్‌లో 2025 జనవరి నుంచి గడచిన 337 రోజుల్లో.. 203 రోజులు సాధారణ స్థాయిలో ఉండగా.. 110 రోజులు పూర్ ఏక్యూఐ నమోదు అయింది. ఇక 23 రోజులు అన్‌హెల్తీగా గాలి నాణ్యతను పేర్కొన్నారు. 2022 నుంచి డిసెంబరు నెల వాయు నాణ్యత సూచీ పరిశీలిస్తే.. ఈ ఏడాది 185గా ఉంది. హైదరాబాద్‌లోని ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో బుధవారం ఏక్యూఐ 253గా నమోదు అయింది. అదే సమయంలో అమీన్‌పూర్‌లో 201గా ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కూడా ఢిల్లీ వైపు అడుగులు వేస్తోందని నగర ప్రజలు ఆందోళన



వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి హైదరాబాద్‌లో వాయు నాణ్యత మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దుమ్ము గాలిలోకి లేవడం.. హైదరాబాద్‌లో గాలి నాణ్యత పడిపోవడానికి ప్రధాన కారణం. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో అధికంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో నిర్మాణ ప్రదేశాలలో మట్టిని తవ్వడం, భవనాలు కూల్చడం, సిమెంట్, ఇసుక తరలించడం వంటి కారణాలతో ధూళి కణాలు పైకి లేస్తున్నాయి. దీంతో పాటు రోడ్లపై ఎక్కడికక్కడే మట్టి పేరుకుపోయి ఉండటం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. వాహనం వెళ్లిన ప్రతిసారి ధూళి కణాలు గాల్లోకి లేస్తున్నాయి. వీటికి తోడు భారీ పరిశ్రమల నుంచి విడుదలయ్యే ఉద్గారాల వల్ల వాయు నాణ్యత పడిపోతోంది. అయితే వాయు కాలుష్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వం సరైన విధానాలు అనుసరించడం లేదనే వాదన ఉంది. వాయు కాలుష్యాన్ని ఒక నగరానికి పరిమితం చేసి చర్యలు చేపట్టడం సరికాదని.. ఒక ప్రాంతం మొత్తంగా చర్యలు తీసుకోవాలంటున్నారు. ఢిల్లీలా పరిస్థితి చేజారకముందే ప్రభుత్వం మేల్కొని కాలుష్య కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పారిశ్రామికవాడల్లో కాలుష్యాన్ని తెలిపే మెషీన్లు ఏర్పాటు చేయడం, రియల్ టైమ్‌లో కాలుష్య స్థాయిలను పీసీబీ నిరంతరం పర్యవేక్షించడం ముఖ్యమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ వాహనాల నుంచి వచ్చే వ్యాక్యులర్ పొల్యూషన్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు. చలి వాతావరణం వలన కాలుష్య తీవ్రత రానున్న రోజుల్లో మరింతగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే, నగరంలో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరినందున వృద్ధులు, చిన్నారులు, ఎక్కువ సమయం ఇళ్లలోనే గడపడం ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. అత్యవసరమైతే మాస్కులు ధరించి బయటకు రావాలని సూచిస్తున్నారు. ఈ విషయమై పీసీబీ అధికారులు స్పందిస్తూ.. ప్రస్తుతం సంతృప్తికరమైన స్థాయిలోనే గాలిలో నాణ్యత సూచికలు ఉన్నాయని, కొన్ని థర్డ్‌పార్టీ యాప్‌లు మాత్రం కాలుష్య సూచికలను అధికంగా చూపుతున్నాయని కొట్టిపారేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్న సంగతి తెలిసిందే. శీతాకాలంలో పరిస్థితి మరింత దిగజారుతోంది. ప్రపంచంలోకెల్లా అత్యంత దారుణమైన వాయు నాణ్యత కలిగిన నగరంగా ఢిల్లీ ఉంది. పరిస్థితి చేజారాక ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితాలు రావడం లేదు. ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షం కురిపించి, కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

## 'ఒక్కొక్కరి తాటతీస్తాం'

( మొదటిపేజీ తరువాయి )

టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని బీజేపీ కార్యాలయాలను ముట్టడించడానికి కాంగ్రెస్ శ్రేణులు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని గాంధీ భవన్ దగ్గర భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో పదేళ్లుగా కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను బీజేపీ ప్రభుత్వం వేధిస్తోందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. అందులో భాగంగానే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఎఫ్ఐఆర్‌లో కూడా యాడ్ చేసిందని అన్నారు. కానీ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు మాత్రం ఈడీ కేసులను తప్పుబట్టిందని గుర్తు చేశారు. బీజేపీ చేసిన అరాచకాలకు డీసీసీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరపాలని మహేష్ కుమార్ ఆదేశించారు. ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ అనుబంధ సంఘాలు నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తమ కార్యాలయాలను ముట్టడిస్తామంటే తామేమీ చూస్తూ కూర్చోమన్నారు. ప్రతిఘటిస్తామని, ఒక్కొక్కరి తాటతీస్తామని రామచందర్ రావు అన్నారు. కార్యాలయాల ముట్టడులు, ధ్వంసం చేయడాలు మంచి సంస్కృతి కాదని అన్నారు. విచారణ సంస్థలకు, బీజేపీకి ఎటువంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏం జరిగింది అనేది విచారణ సంస్థలు, కోర్టులు చూసుకుంటాయని అన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికే కాంగ్రెస్ ఈ ముట్టడులకు ప్లాన్ చేస్తోందన్నారు.

కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఇన్నోవాలో వచ్చారు.. బీజేపీ కార్యకర్తలు కూడా అక్కడికి వచ్చారు.. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. బారికేడ్ లకు ఇటువైపు బీజేపీ కార్యకర్తలు నిలబడ్డారు.. బీజేపీ నేతల చేతిలో కర్రలు ఉండటం ఉద్రిక్తతకు దారి తీసింది. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని.. నేషనల్ హెరాల్డ్ పేపర్ కేసు విషయంలోనూ అదే జరిగిందని తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. బీజేపీ పెడుతున్న అక్రమ కేసుల గురించి ప్రజలకు వాస్తవాలు చెప్తామన్నారు. తాజాగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. గాంధీ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుంది. గాంధీ పేరుని సైతం తొలగిస్తుందన్నారు. న్యాయం గెలివడానికి సమయం పట్టొచ్చు.. కానీ చివరికి గెలిచేది న్యాయమే.. నేషనల్ హెరాల్డ్ పేపర్ గురించి బీజేపీకి ఏమి తెలియదు.. మా మార్గమే అహింస మార్గం.. అలాగే శాంతుయుతంగా నిరసన చేసి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని వెల్లడించారు. మరోవైపు.. ఇదే అంశంపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు.. "రాహుల్, సోనియా గాంధీ పై బీజేపీ అక్రమ కేసు లు పెడుతుంది. ఢిల్లీ కోర్టు లో ఈడీ వేసిన ఛార్జిషీట్ ని కొట్టివేసింది. స్వాతంత్ర్యం నుంచి ఉన్న పేపర్ నేషనల్ హెరాల్డ్. దేశ కోసం ఆస్తులు త్యాగం చేసింది గాంధీ కుటుంబం. అలాంటి కుటుంబంపై కావాలనే బీజేపీ వేధింపులకు గురి చేస్తుంది. ఇదే అంశాన్ని మేము ప్రజలోకి తీసుకెళ్తాం." అని వ్యాఖ్యానించారు.



## అంబేద్కర్ సంఘాన్ని మరింత బలోపేతం చేద్దాం



**అంబేద్కర్ సంఘం సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు బక్కని నర్సింగ్ రావు**

**కీసర,విశాల భారతి :**

కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో కీసర పెద్దమ్మ తల్లి ఆలయ వారణలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సంఘం నాయకులు బక్కని నర్సింగ్ రావు.ఈ సంధర్బంగా ఈ సమావేశములో సంఘం అభివృద్ధికై సంఘం నాయకులతో కలిసి పలు అంశాలు చర్చించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్ మాట్లాడుతూ నాకు సంఘం అధ్యక్షుడు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.ప్రతి ఆదివారం జ్ఞానమల కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూవుల మాల వేయడం జరిగింది.ఈ రెండు సంవత్సరాల వ్యవధిలో వంద వారాలు జ్ఞానమల కార్యక్రమం చేయడం జరిగింది అని తెలిపారు.అలాగే కీసర గుట్టలో అంబేద్కర్ భవనం కోసం పలువురు నేతలను మరియు నాయకులను కూడా కలవడం జరిగిందన్నారు.ఈ విషయంపై ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించారు అని తెలిపారు.సంఘం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అవుతుంది కాబట్టి కొత్త కమిటీ ఏర్పాటు చేసుకోవాలి అని పలువురు కమిటీకి సూచనలు చేయడం జరిగింది. అందరి సహకారంతో నన్ను అధ్యక్షుడుగా మరి కొన్ని నెలలు కొనసాగిస్తే కీసర గుట్టలో అంబేద్కర్ భవనాన్ని పూర్తిగా చేస్తాను అని కమిటీకి వివరించారు. జిల్లా నాయకులు బక్కని నర్సింగ్ రావు మేడ్చల్ జిల్లా నాయకులు బక్కని నర్సింగ్ రావు మాట్లాడుతూ అసలు అంబేద్కర్ సంఘం అంటే జ్ఞానమల కార్యక్రమం ఒక్కటే కాదు అసలు అంబేద్కర్ ఆశయాలు బోధించు,సమీకరించు,పోరాడు అంటే మన దళితులకు ఏమైనా సమస్యలు వస్తె వాటిని ఎలా పరిశీలించుకోవాలి ఎలా ఐకమత్యంగా ముందుకు పోవాలి అని దేశ వ్యాప్తంగా అంబేద్కర్ సంఘాలు వేసుకోవడం జరిగిందన్నారు. కావున సంఘం సభ్యులు గమనించాలి ప్రతి గ్రామంలో అంబేద్కర్ సంఘం కమిటీలు వేయమని చెప్పడం జరుగుతుంది కానీ మండల కమిటీ సభ్యులు మాత్రం మర్చిపోతున్నారు అని అన్నారు.జ్ఞానమల కార్యక్రమలు రెండు వందల వారాలు చేసి విజయవంతం చేసిన సంఘం నాయకులను అభినందించారు.అందరి సహాయసహకారాలతో కొత్త కమిటీ వేసుకొని అంబేద్కర్ సంఘంను మరింత బలోపితం చేయాలి అని అందరికీ సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ అంబేద్కర్ సంఘం నాయకులు మంచాల పెంటయ్య,మొరుగు రవీందర్,మంచాల రాజలింగం, చొక్కపురం శ్రీరాములు, శీలం శ్రీనివాస్,సంఘం నాయకులు బక్కిని కుమార్,బోడా శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి తుడం శ్రీనివాస్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్టిల్ట్స్ టు అనుమతులతో నాలుగు అంతస్తుల భవనం

- పేరు రెసిడెన్షియల్.. నిర్మాణం కమర్షియల్
- సీజింగ్ నోటీసులతో కాలయాపన చేస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసిపి
- లక్షలు రూపాయలు లంచం ఇచ్చాం
- అందుకే అక్రమ నిర్మాణం చేపడుతాం.. ఎల్బీనగర్లో బిల్డర్ల బరితెగింపు

**ఎల్బీనగర్, విశాలభారతి:**


హయత్ నగర్ సర్కిల్03 విజయవాడ హైవేకు ఆనుకుని పనామ చౌరస్తా వద్ద బహుళ అంతస్తుల భవనం అక్రమ నిర్మాణం జరుగుతుందని తెలిసింది. ఆప్రాంతంలో స్థలం ఎక్కువ ఉంటే పర్మిషన్ తీసుకుని స్టిల్ ప్లస్ 5 అంతస్థులు వేసుకోవచ్చు. కానీ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా స్టిల్ ప్లస్ టు పర్మిషన్తో నాలుగు అంతస్తుల వాణిజ్య భవనం నిర్మించారని సమాచారం. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులు భవనం మొదలు బహుళ అంతస్తుల నిర్మాణం వరకు ఎన్ని విధాలుగా జీహెచ్ఎంసీని మోసగించవచ్చో అన్ని విధాలుగా మోసం చేశారనీ, ఈ నిర్మాణం మొదటి నుంచి అక్రమ పద్ధతిలోనే కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు నెలల క్రితం సదరు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో జీ హెచ్ఎంసి అధికారులు, కానీ జీహెచ్ఎంసి ఆదేశాలను నిబందనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని,ఆ తర్వాత ఆ భవనానికి నోటీసు ఇచ్చారు. నోటీసులు ఇచ్చి నెల రోజులు కావస్తున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలిసింది. యథేచ్ఛగా స్టిల్ ప్లస్ టు పర్మిషన్‌తో నాలుగు అంతస్తుల అక్రమ నిర్మాణం సాగిస్తుంటే అధికారులెందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో తెలియాల్సి ఉంది. ఇంత తతంగం జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ పరిధిలో జరుగుతున్న లక్షల రూపాయలు లంచం రూపంలో చేతులు మారుతున్న ఏసీబీ అధికారులు అవినీతి అధికారులపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. సీజింగ్ నోటీస్ ఇచ్చి సీజ్ చేస్తాం: హయత్ నగర్ సర్కిల్03 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి. జి ప్లస్ టు అనుమతులు తీసుకొని అదనంగా రెండు వాణిజ్య అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన భవనంపై కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు పర్మిషన్ ఇచ్చారు సీజింగ్ ఆర్డర్ నోటీసులు ఇచ్చి భవనాన్ని సీజ్ చేస్తామన్నారు. దాన్ని అతిక్రమించి బిల్డింగ్ యజమాని అదనంగా స్లాబుల్ వేశారు.



# 'జీ రామ్ జీ'పై గరం గరం..!

( మొదటిపేజీ తరువాయి )

సభ్యులు బిల్లు ప్రతులు చించి విసిరేశారు. బిల్లు ఆమోదం తర్వాత సభ శుక్రవారానికి వాయిదా పడింది. బిల్లుపై చర్చలో భాగంగా మాట్లాడిన కేంద్రవ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రాలు కార్మికులపై ఎక్కువగా ఖర్చు చేసి అభివృద్ధి పనులకు తక్కువగా ఖర్చుచేశాయని తెలిపారు. యూపీఏ కన్నా ముందు ఉన్న ప్రభుత్వాలు కూడా నరేగా మాదిరి ఉపాధి గ్యారంటీ పథకాలను ప్రారంభించాయని తెలిపారు. 2009 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నరేగా పథకానికి మహాత్మా గాంధీ పేరును అప్పటి యూపీఏ ప్రభుత్వం పెట్టిందని శివరాజ్‌సింగ్ ఆరోపించారు. భారత్‌పాకిస్థాన్ విభజనకు ఒప్పుకొని గాంధీ ఆదర్శాలకు కాంగ్రెస్ పార్టీ తూట్లు పొడించిందని విమర్శించారు. అంతకు ముందు వీబీ జీ రామ్ జీ బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంటు ప్రాంగణంలో విపక్షాలు నిరసన తెలిపాయి. వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌తో గాంధీ విగ్రహం నుంచి మకర ద్వారం వరకు విపక్ష ఎంపీలు ర్యాలీ చేశారు. ఇందులో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఎంపీలు



కేసీ వేణుగోపాల్, కనిమొళి, టీఆర్ బాలు, ఏ. రాజా తదితర పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడం ద్వారా కేంద్రం ప్రజాస్వామ్యాన్ని చంపేస్తోందని ఎంపీ కేసీ వేణుగోపాల్ అన్నారు. వీబీ జీ రామ్ బీ బిల్లును పార్లమెంటు స్థాయి సంఘానికి పంపాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీని అవమానించడమే కాకుండా, గ్రామాల్లో సామాజిక, ఆర్థిక పరివర్తన తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన పని హక్కును కూడా అణచివేసిందని మల్లికార్జు ఖర్గే ఉన్నారు. ప్రభుత్వ ఈ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం కోసం 2025లో అప్పటి యూపీఏ ప్రభుత్వం 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. ఇక ఈ కొత్త బిల్లు ప్రకారం, పేరు మార్చడంతోపాటు ఉపాధి హామీ పథకం అమలులో గుణాత్మకమైన మార్పులను కేంద్రం తీసుకురానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి సంవత్సరంలో కనీసం 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధి కల్పించనున్నారు. దీని ద్వారా సుసంపన్న, సుస్థిర గ్రామీణాభివృద్ధిని సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే పర్యవేక్షణకే కేంద్రానికే పరిమితం కానుంది. నిర్వహణ, జవాబుదారీతనం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. రైతులకు కూలీల లభ్యత పెరిగి కూలీరేట్లు నియంత్రణలో ఉండేందుకు వీలుగా వ్యవసాయ సీజన్లో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులను నిలిపివేయాలని ప్రతిపాదించారు. ఉపాధి కల్పించడంతోపాటు నాలుగు ప్రాధాన్య రంగాల్లో చిరకాలం మన్నే మౌలికవసతుల కల్పనకు కొత్త చట్టం వీలు కల్పిస్తుంది. ప్రతిపనినీ వ్యూహాత్మక దృష్టితో చేపడతారు. జలభద్రత, మౌలికవసతుల కల్పన, జీవనోపాధి సృష్టి, వాతావరణ మార్పులను తట్టుకొని నిలిచే నిర్మాణ పనులపై దృష్టి సారించి వాటిద్వారా గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడే ఆస్తులను కల్పిస్తారు. కూలీల డిజిటల్ హాజరు, డిజిటల్ చెల్లింపులతోపాటు డేటా ఆధారిత ప్రణాళికలకు ప్రాధాన్యమిస్తారు. ఈ బిల్లును మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న విపక్ష సభ్యులు సభలో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. గందరగోళం మధ్యే కొందరు ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతిని చింపి గాలిలోకి విసిరేశారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చడం, నిబంధనల మార్పుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సభలో కొద్దిసేపు తీవ్ర గందరగోళం నెలకొంది. అంతకుముందు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసన మార్చ్ నిర్వహించారు. ఈ బిల్లు ఆమోదం తర్వాత లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చేందుకే ఈ వీబీజీ రామ్ జీ బిల్లును ప్రవేశపెట్టామని ప్రభుత్వం పేర్కొంది. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ జీవనోపాధిని పెంచడమే దీని ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడానికే ప్రభుత్వం ఈ కొత్త బిల్లును తీసుకువచ్చిందని, పేదల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తున్నారని విపక్ష నేతలు ఆరోపించారు. సభలో చర్చకు అవకాశం ఇవ్వకుండానే బిల్లును పాస్ చేసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు.

## భవన నిర్మాణ కార్మికులకు అండగా మోడీ ప్రభుత్వం

### ఏనుగు సుదర్శన్ రెడ్డి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తమ కఠినమైన శ్రమతో ప్రజల జీవితాల్లో పెను మార్పులకు కారణమవుతున్న భవన నిర్మాణ కార్మికులకు మోడీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని బిజెపి మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అవుషాపూర్‌లో భవన నిర్మాణ కార్మికులకు బీమా కార్డుల జారీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచంలో ఎత్తైన బురుజ్ ఖలీఫాల నుంచి గ్రామాల్లోని చిన్న ఇళ్ల వరకు జరిగే ప్రతి నిర్మాణంలో భవన నిర్మాణ కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి కట్టడాలు నిర్మిస్తున్నారని తెలిపారు. గతంలో వారి జీవితాలు గాలిలో దీపాల్లా ఉండేవని, కానీ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వారి జీవితాలకు భద్రత కల్పించేలా జీవిత బీమా పథకాలను ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ బీమా పథకాలు కేవలం ప్రమాదాల నుంచి రక్షణ కల్పించడమే కాకుండా, కుటుంబాల్లో వివాహాలు వంటి కీలక కార్యక్రమాలకు కూడా ఆర్థిక భరోసా అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరేలా వైఎస్ఆర్ ట్రస్ట్ అనుసంధాన వేదికగా పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమానికి తమ ట్రస్ట్ సేవలు నిరంతరం కొనసాగుతాయని ఏనుగు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, వైఎస్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహనా సదస్సు

### రాచకొండ ఏహెచ్టీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు, రాచకొండ ఎస్.ఓ.టి. ఎల్‌బీనగర్ ఇంచార్జ్ అదనపు డీసీపీ యం.డి. షాకీర్ హుసేన్ సూచనలతో రాచకొండ ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సదస్సును రాచకొండ ఏహెచ్‌టీయూ ఎస్ఐలు జి. వెంకట శ్రీను, కే. రాములు, ఎం.డి. ఖలీల్ అహ్మద్, ఏఎస్సై జి. రంగా రెడ్డి, మహిళా ఏఎస్సై సి. మీనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ కే. రాములు మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి బాల కార్మికులు, నిర్బంధ కార్మికులు, బాల బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, మహిళలను మోసపూరితంగా లేదా బలవంతంగా అపహరించి వ్యభిచారానికి గురి చేయడం, బాలలను అమ్మడం, బిక్షాటన చేయించడం, బాలికల వేధింపులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, సైబర్ బెదిరింపులు, మత్తు పదార్థాల వినియోగం, రోడ్డు భద్రత, మహిళల భద్రత కోసం టిసేఫ్ యాప్ వినియోగంపై వివరించారు.అంతేకాకుండా కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లపై కూడా అవగాహన ఇచ్చారు. సైబర్ మోసాలు, అత్యవసర పరిస్థితుల్లో గతంలో వేర్వేరు నంబర్లు ఉపయోగించేవారని, ప్రస్తుతం అన్ని అత్యవసర సేవల కోసం ఒక్కటే నంబర్ 112 అమల్లో ఉందని తెలిపారు. దీని ద్వారా వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ సిబ్బందితో పాటు పాఠశాల ప్రిన్సిపల్ జె. రమేశ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇలాంటి బతుకు కంటే చావడమే మేలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. 75 ఏళ్ల వయసులో, గతంలో స్పీకర్‌గా, మంత్రిగా అన్ని గౌరవ పదవులనూ అనుభవించిన వ్యక్తి.. ఇలాంటి వయసులో కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటని మండిపడ్డారు. కేసీఆర్ ఆయనకు ఇవ్వని పదవి లేదని, కానీ నేడు గౌరవం పోగొట్టుకుని కాంగ్రెస్ బెంచీల్లో కూర్చోవడం ఆయన పతనానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో పోచారం ప్రవర్తనను కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయి ఉండి కాంగ్రెస్ పక్షాన ఎందుకు కూర్చున్నారని మా సభ్యులు ప్రశ్నిస్తే, బాత్రూమ్ దగ్గరగా ఉందని అందుకే ఇక్కడ కూర్చున్నానని సమాధానం ఇవ్వడం అత్యంత దౌర్భాగ్యం" అని పేర్కొన్నారు. ఇలాంటి అగౌరవకరమైన జీవితం గడపడం కంటే మరణించడం మేలంటూ ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పక్షాన చేరి పోచారం తన ఇన్నేళ్ల మంచి పేరును స్వయంగా మంట గలుపుకున్నారని అన్నారు. అలాగే పార్టీ మారిన మిగిలిన 10 మంది ఎమ్మెల్యేల తీరును కూడా కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. వారు తాము ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని, కనీసం తాము ఏ పక్షమో మగవారో, ఆడవారో అన్నంత స్పష్టత లేనట్లుగా చెప్పుకోలేక పోతున్నారని ఘాటుగా విమర్శించారు. ఇలాంటి సిద్ధాంతం లేని రాజకీయం సమాజానికి చెడు సంకేతాలు



పంపిస్తుందని, ప్రజలు వీరిని అసహ్యించుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు.

సీనియర్ నాయకుడు కడియం శ్రీహరి తీరుపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. తనకు నచ్చిన పార్టీలో ఉంటానంటూ కడియం చేస్తున్న వ్యాఖ్యలు వింటుంటే.. అలా మాట్లాడే వారిని కొట్టాలనిపిస్తుందని ఆవేశంగా వ్యాఖ్యానించారు. అధికార దాహం కోసం పార్టీలు మారే సంస్కృతిని తెలంగాణ ప్రజలు సహించరని, నైతిక విలువలు లేని ఇలాంటి నాయకులకు భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్ ఈ సందర్భంగా హెచ్చరించారు 'పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో.. అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయి' అని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా.. నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా భారీగా సర్పంచ్‌లను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదు' అని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై మాజీ మంత్రి కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని.. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. 'నూతనకల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనం' అని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని కేటీఆర్ గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ.. గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కి పైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై మరోసారి కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని మండిపడ్డారు.

## ఇబ్రహీంపట్నం ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు

### మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)

**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ, పరిధిలోని నాలుగు మండలాల గ్రామాలలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులకు తమ అమూల్యమైన ఓటు వేసి ఘన విజయం అందించిన నియోజకవర్గ ప్రజలకు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు అలాగే వార్డు సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలు చూపిన విశ్వాసానికి తగ్గట్టుగా గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిబద్ధతతో పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.



## బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఉపసర్పంచ్ చేరిక

### డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో గులాబీ కండువా కప్పి ఆహ్వానం



**వికారాబాద్, విశాల భారతి:** మండలంలోని నారాయణపూర్ గ్రామానికి నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్ కందాడ ధర్మారెడ్డి గారు తన అనుచరులతో కలిసి వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గారి సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ గారు కందాడ ధర్మారెడ్డి గారికి గులాబీ కండువా కప్పి, పార్టీ కార్యక్రమాలు, సిద్ధాంతాలు నచ్చి బీఆర్ఎస్ పార్టీలో చేరడం అభినందనీయమని తెలిపారు. గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కొత్తగా చేరిన నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు పడిగళ్ళ అశోక్, మండల జనరల్ సెక్రెటరీ శివకుమార్, మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు శ్రీనివాస్, మండల బీసీ విభాగం అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు అనిల్ తో పాటు నాయకులు హన్మంత్ రెడ్డి, బిచ్చయ్య, ప్రవీణ్, రాములు, జంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయ కమిటీ నియమకం



**సికింద్రాబాద్,విశాల భారతి:** సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చిలకలగూడలో ఉన్న ప్రసిద్ధ కట్టమైసమ్మ,పోచమ్మ దేవాలయానికి నూతన ఆలయ కమిటీని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి అదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ ఈఓ సమక్షంలో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ కట్టమైసమ్మ,పోచమ్మ దేవాలయం చిలకలగూడ ప్రాంత ప్రజల ఆరాధ్య దైవస్థానమని, ఆలయ పరిరక్షణతో పాటు సంప్రదాయాలు, ఆచారాలు కాపాడే బాధ్యత కమిటీపై ఉందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు, పరిశుభ్రత, భద్రత చర్యలు, ఉత్సవాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులు పారదర్శకంగా, సమన్వయంతో జరగాలని, భక్తుల విశ్వాసానికి తగ్గట్టుగా కమిటీ పనిచేయాలని ఆయన కోరారు. నూతన కమిటీ పదవీకాలం రెండు సంవత్సరాలుగా నిర్ణయించినట్లు తెలిపారు. కమిటీ చైర్మన్ గా గుంటి కృష్ణ సభ్యులుగా అమృత్, శ్రీనివాస్, ధర్మవీర్, కృష్ణ, రవి శంకర్, తిరుమలాపురం రాధ, తిరుమలా చారి నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, సందీప్ రాజ్, శిల్ప చారీ, అనిల్, జగ్గు, అమర్నాథ్ గౌడ్, చందర్, బగ్గు హనుమంత్ రావు, దేవ తదితరులు భక్తులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్‌లకు ఎసిపి జానకిరెడ్డి కౌన్సెలింగ్



**బాలాపూర్, విశాలభారతి:** పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 57 మంది పై రౌడీ షీట్ ఉన్నట్టు ఎసిపి తెలిపారు. వివిధ కేసుల్లో వారిపై రౌడిషీట్ ఓపెన్ చేయడం జరిగిందని అన్నారు. రౌడిషీటర్ ల కదలికలను తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారని అన్నారు. ఎవరిపై అయితే రౌడిషిట్ ఉందో వారు ప్రవర్తన మార్చోకోవాలని సూచించారు. ప్రవర్తన మార్చుకోకుండా నేరాలకు పాల్పడితే పిడి యాక్ట్ నమోదు చేస్తామన్నారు. రాత్రి పది దాటిన తర్వాత బయట తిరగొద్దనారు. తమ కుటుంబాలతో కలిసి నూతన జీవితాన్ని గడపాలని ఏసీపీ బాలపూర్ జనకి రెడ్డి బాలాపూర్ సీఐ పి.సుధాకర్ అన్నారు.

## రోడ్ల పనుల పరిశీలించిన కార్పొరేటర్

**విశాల భారతి అబ్దుల్లాపూర్మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుభద్ర కాలనీలో జరుగుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం పరిశీలించారు. రోడ్డు పనుల ప్రస్తుత ప్రగతి, నాణ్యత, పనితీరును సంబంధిత అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు నిర్మాణ పనులను వేగంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని స్వయంగా పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు లక్ష్మణ స్వామి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెల్లడి

- కాంగ్రెస్,బిఆర్ఎస్,బిజెపి ఇండిపెండెంట్ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ
- కాంగ్రెస్ సర్పంచ్ లుగా 8 , బీఆర్ఎస్ సర్పంచ్ లుగా 4 , 1బీజేపీ సర్పంచ్‌గా , 1ఇండిపెండెంట్ సర్పంచ్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో జరిగిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడం జరిగింది. మండలంలోని 14 గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించారు. 1) బలిజగూడ గ్రామపంచాయతీలో బీజేపీ సర్పంచ్ అభ్యర్థి ఉప్పు మాధవి 90 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. 2) అనాజ్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి రాచపాక నవనీత మహేష్ 781 పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఈ గ్రామంలో పది వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం గమనార్హం. 3) బండ రావిరాల గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి కందికంటి విజయ్ కుమార్ 47 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందగా, 4) బాటసింగారం గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గౌరీ శంకర్ 400 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి మారుతి ప్రసాద్‌పై విజయం సాధించారు. 5) మజీద్‌పూర్ గ్రామంలో ఇండిపెండెంట్ అభ్యర్థి మేడిపల్లి ప్రియా 300 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి లావణ్యపై గెలుపొందారు. 6)కవాడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి స్వల్పంగా 20 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 7)చిన్నరావిరాల గ్రామంలో పబ్బతి బాలకిషన్ గౌడ్ 33 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.8) అబ్దుల్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ 827 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. 9)గండిచెరువు గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి జక్క రవీందర్ రెడ్డి 443 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి జక్క పాపిరెడ్డిపై గెలిచారు. 10)లష్కర్‌గూడా గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి అల్లే అవిలయ్య యాదవ్ 240 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.11)గుంతపల్లి గ్రామంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి అంతటి హేమలత జంగయ్య 53 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా, 12) పిగ్లిపూర్ గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి కోట ప్రభాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 13) ఇనామ్‌గూడా గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాఘవేందర్ విజయం సాధించగా, 14) జాఫర్‌గూడా గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎర్ర వెంకటేష్ యాదవ్ 111 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఫలితాలతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో రాజకీయంగా ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది.

# మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం

**కేశంపేట, విశాలభారతి:**

కేశంపేట మండలపరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు శంకరమ్మ గురువారం ఆకస్మికంగా మరణించింది. గ్రామ ప్రజా ప్రతినిధుల ద్వారా విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్ రెడ్డి 5 వేలు, గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం 10వేలు, గ్రామ ప్రజాప్రతినిధులు 6వేలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు 10వేల ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వార్డు సభ్యులు చంద్రయ్య, రిజ్వానాబేగంమోహిజ్, మంజులజంగేష్, నాగరాజు, వెంకటమ్మమల్లయ్య నాయకులు జంగయ్య, మల్లయ్య, శ్రీశైలం, ఖాజాపాషా, ముత్యాలు, శేఖర్, శివ, బాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## గోవర్ధనచారి మృతికి పాత్రికేయుల నివాళి



**అశ్వాపురం, విశాలభారతి:** మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన ప్రముఖ దినపత్రిక సీనియర్ పాత్రికేయుడు జిల్లేపల్లి గోవర్ధన చారి మృతికి గురువారం పాత్రికేయులు నివాళులర్పించారు. ఆయన మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో కొడారి వెంకటేశ్వర్లు, సురేందర్ రెడ్డి, కొల్లి నాగేశ్వరరావు, తూము సత్యనారాయణ, మాదిగ జేఏసీ, బీఆర్ఎస్ నాయకులు గద్దల నాగేశ్వరరావు, గద్దల రామకృష్ణ, పూస రమేష్ ఉన్నారు.

## గోవర్ధనచారి మృతికి సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పాయం

**నివాళులర్పించిన పలు రాజకీయ పార్టీల నాయకులు**



**అశ్వాపురం, విశాలభారతి :** ప్రముఖ దినపత్రికలలో విలేకరిగా పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ జిల్లేపల్లి గోవర్ధన చారి గురువారం తెల్లవారుజామున ఆయన స్వగృహంలో అకాల మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మొండికుంట గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**

గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ పత్రికా విలేఖరి గోవర్ధన చారి మృతికి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సంతాపం వ్యక్తం చేశారు. తొలుత ఆయన పార్థివ దేహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కందుల కృష్ణార్జున రావు, మర్రి మల్లారెడ్డి, కూరపాటి చలపతిరావు, భూక్య చందూలాల్, నక్కన పోయిన పాపారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి బిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, కొండ బత్తుల ఉపేందర్, ఆవుల రవి, చామకూరి వెంకన్న, పెదవీర రాఘవులు, సిపిఎం, సిపిఐ నాయకులు ఉన్నారు.

## సర్పంచులు, ఉప సర్పంచులను సన్మానించిన పొంగులేటి

**సన్మాన కార్యక్రమములో పాల్గొన్న రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల**



**పాల్వంచ, విశాల భారతి:** ఇటీవల పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో పాల్వంచ మండలం నుండి విజయం సాధించిన 17 మంది సర్పంచ్, ఉప సర్పంచ్ లను రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘనంగా సన్మానించారు. విద్యానగర్ లోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని కొత్తగూడెం, ఇల్లందు, పినపాక, భద్రాచలం, అశ్వారావు పేట నియోజకవర్గాలకు చెందిన విజయం సాదించిన సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గం లోని పాల్వంచ మండలానికి చెందిన కొత్త సూరారం, పాత సూరారం, పాండు రంగాపురం తండా, యానంబైలు, కిన్నెరసాని, పుల్లయి గూడెం, లక్ష్మదేవి పల్లి (V), ఉల్వనూరు, బంజరు, జగన్నాధపురం, చంద్రాల గూడెం, మల్లారం, నారాయణ రావు పేట, SC కాలనీ, నాగరం, బసవతారకకాలనీ, తోగ్గూడెం, ఇల్లందుల పాడు తండా, మొత్తం 17 పంచాయతీల సర్పంచ్ లను పొంగులేటి శాలువా బొకే లతో సన్మానించి స్వీట్లు పెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎమ్ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, శాసన సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్ లకు మంత్రి పొంగులేటి సన్మానం

- సోంపల్లి సర్పంచ్ తాటి లక్ష్మి అభివృద్ధే నాధ్యేయం
- ఉపసర్పంచ్ పండగ సౌజన్య ప్రజల శ్రేయస్సే నా లక్ష్యం



**బూర్గంపాడు,విశాలభారతి:** తెలంగాణ ప్రభుత్వం మూడు విడతలగా స్థానిక ఎలక్షన్లు నిర్వహించడంతో గ్రామాల్లో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులు సత్తాచాటారు. భద్రాద్రి కొత్తగూడెం కేంద్రంగా 5నియోజకవర్గాల సర్పంచ్ వార్డ్ మెంబర్ల సన్మాన సభ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజా పాలన అందిస్తుంటే ప్రతిపక్షం కారు కూతలు కూస్తు స్థానిక ఎలక్షన్లో ప్రతిపక్ష పార్టీ ఎక్కువ స్థానాలు గెలిచినట్టు సొంత చానల్లో తప్పుడు కథనాలు ప్రసారం చేయడం హాస్యస్పదంగా ఉందని ప్రతిపక్ష పార్టీ నాయకులను హేద్దేవా చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త వెంట పొంగులేటి శ్రీనన్న ఉంటాడని మళ్లీ అధికారంలోకి కాంగ్రెస్ పార్టీయే వస్తుందని ప్రతిపక్ష పార్టీలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజా పాలన చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల వేల గ్రామాల్లో కాంగ్రెస్ మూడు రంగుల జెండా రెపరెపలాడుతూ విజయకేతనాలు మోగించాయి అని అన్నారు. అనంతరం నియోజక వర్గ మండలాల వారీగా సర్పంచ్ ఉప సర్పంచ్ లకు స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మిఠాయిలు తినిపించి శాలువాతో ఘనంగా సత్కరించారు. సోంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తాటి లక్ష్మి,ఉపసర్పంచ్ పండగ సౌజన్య లను దీవించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

# 20 ఏళ్ల నిరీక్షణకు తెర

- రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది
- రూ.15 వేల కోట్ల విలువ చేసే భూములపై చారిత్రాత్మక తీర్పు
- 102 ఎకరాల భూమి అటవీశాఖకు చెందుతుందని స్పష్టం
- యాజమాన్య హక్కుల కోసం గత 20 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం
- భూమి తమదేనిని 260 మంది న్యాయస్థానాలను ఆశ్రయించారు
- భూమిని అధికారికంగా రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని ఆదేశించింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానంలో ఊహించని రీతిలో భారీ ఊరట లభించింది. హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత ఖరీదైన దాదాపు రూ. 15,000 కోట్ల విలువ చేసే భూములపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల వివాదాస్పద భూమి పూర్తిగా తెలంగాణ అటవీశాఖకు చెందుతుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ భూమిపై యాజమాన్య హక్కుల కోసం గత 20 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం కొనసాగుతోంది. నిజాం నవాబులు, సాలార్ జంగ్, మీరాలం వారసులమని చెప్పుకుంటూ సుమారు 260 మంది ఈ భూమి తమదేనంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. గతంలో ఈ వివాదంపై విచారణ జరిపిన రాష్ట్ర హైకోర్టు.. పిటిషన్ వేసిన వ్యక్తులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం పట్టువదలకుండా ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును నిశితంగా పరిశీలించింది. అటవీ రికార్డులు, చారిత్రక ఆధారాలను విశ్లేషించిన అనంతరం సదరు 102 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తులది కాదని.. అది పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్ అని తేల్చి చెప్పింది. హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును కొట్టివేస్తూ.. ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పించింది.

తీర్పు ఇచ్చిన ఎనిమిది వారాల వ్యవధిలో ఈ 102 ఎకరాల భూమిని అధికారికంగా రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆ పత్రాలను కోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలని సూచించింది. దీనివల్ల భవిష్యత్తులో ఈ భూమిపై ఎటువంటి ప్రైవేటు ఆక్రమణలకు అవకాశం ఉండదు. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో.. వనస్థలిపురం, సాహెబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇలాంటి సమయంలో 102 ఎకరాల పచ్చటి అటవీ ప్రాంతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడటం పర్యావరణ పరంగా పెద్ద విజయంగా భావించవచ్చు. ఈ అటవీ భూమి అభివృద్ధి చెందితే... నగర వాసులకు ఆక్సిజన్ అందించే 'అర్బన్ లంగ్స్' గా మారుతుంది. ఈ తీర్పుతో రియల్ ఎస్టేట్ మాఫియా, నకిలీ వారసులమని చెప్పుకునే వారి ఆటలు సాగవని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ధైర్యంగా పోరాడితే విజయం లభిస్తుందని ఈ తీర్పు నిరూపించింది. ఈ అటవీ ప్రాంతాన్ని మరింత పటిష్టంగా కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని.. పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. అయితే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కొనుగోలు చేసిన భూముల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. వారు కొనుగోలు చేసిన భూములు భూదాన్ భూములని పేర్కొంటూ బీర్ల మల్లేష్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. మల్లేష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై మల్లేష్ తొలుత హైకోర్టును ఆశ్రయించారు. కాగా ఈ వ్యవహారాన్ని విచారించిన న్యాయస్థానం ఐఏఎస్, ఐపీఎస్‌లకు అనుకూలంగా తీర్పును వెలువరించింది. దీంతో ఉన్నత న్యాయస్థానం తీర్పును ఛాలెంజ్ చేస్తూ మల్లేష్.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు.. హైకోర్టును తీర్పును సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీం నిర్ణయంతో కొన్ని సర్వే నంబర్ల భూముల కొనుగోలుదారులకు ఈ వివాదం ప్రధానంగా నాగారం గ్రామంలోని సర్వే నంబర్లు 181, 182, 194, 195లలో ఉన్న సుమారు 103 ఎకరాల భూములకు సంబంధించినది. ఇవి 1950వ దశకంలో వినోబా భావే పిలుపు మేరకు దాతలు ఇచ్చిన భూదాన్ భూములుగా రికార్డులలో ఉన్నాయి. పేదలకు పంపిణీ చేయాల్సిన ఈ భూములు ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండాల్సి ఉండగా, కాలక్రమేణా రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరిగాయని ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో ఈ భూముల విలువ ప్రస్తుతం రూ.1,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా.

## వరుస హత్యలకు మద్యమే కారణం

- మద్యం గంజాయ్ కి స్లమ్ ఏరియా పిల్లలె బలి పశువులు
- గంజాయి అసలు ముఠా పై కొరడా జూలి పించాలి
- యువకులను చెడగొట్టే అనకొండలపై నిఘా వర్గాలు దర్యాప్తు చేయాలి
- రాబందుల చెరలో చిక్కిన యువకుల భవిష్యత్తు తెల్లారిపోతుంది
- ఉన్నతాధికారులు భద్రాచలం ప్రశాంతత కై వ్యూహం పన్నాలి
- ఆదివాసి నేత కంగాల రమణకుమారి



**భద్రాచలం, విశాలభారతి:**

వరుస హత్యలతో భద్రాచలం ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైందని గంజాయి మద్యం షాప్ ల వలన యువకులు చెడు మార్గం పడుతున్నారని కచ్చితంగా గంజాయి మద్యం మహమ్మారిపై కొరడా జులిపించాలని ఉన్నతాధికారులను మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ఒక ప్రకటనలో కోరారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాచలం దక్షిణ అయోధ్యగా పేరు ప్రఖ్యాతలు గాంచిన ప్రదేశమని ఈ ప్రాంతానికి అనేక ప్రాంతాల నుంచి ఈ ప్రదేశాన్ని చూడటానికి భక్తులు పర్యటకులు వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో గంజాయి స్మగ్లర్లు అలాగే మద్యం సిండికేట్ వ్యాపారస్తులు ఈ ప్రాంత ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని భద్రాచలం ప్రజల మనోభావాలను ప్రశాంతత గల వాతావరణాన్ని తునాతునకలు చేస్తున్నారని ఆమె ఆవేదన చెందారు స్లం ఏరియా పిల్లలను టార్గెట్ చేసి కొంతమంది వారి చీకటి వ్యాపారాలకు ఉపయోగించుకుంటున్నారని ఆ దొంగల ముఠాను పోలీసులు పట్టుకొని ఈ ప్రాంతంలో సమూలంగా గంజాయి మద్యం అమ్మకాలను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో భద్రాచలంలో గ్యాంగ్ వారు జరుగుతున్నాయని ఇవి కేవలం మద్యం గంజాయి మత్తుల్లోనే జరుగుటం అధికారులు చూసి చూడనట్టు పోవడం వలన పెట్రేగిపోతున్నారని ఆమె అన్నారు నడిరోడ్డున సినిమా పక్కిలో యువకులు అతి కిరాతకంగా హత్య గావించడం భద్రాచలానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని ఆమె ఆవేదన చెందారు వరుస హత్యలతో భద్రాచలానికి ఉన్న చరిత్ర కనుమరుగవుతుందని అలాగే పట్టణం ప్రజలు వరుసహత్యలతో భయభ్రాంతులకు గురవుతున్నారని ఆమె తెలిపారు ప్రతి కాలనీలో యువకులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు తక్షణమే బార్ షాపులను బందు చేయాలని గంజాయి స్మగ్లర్ దారులపై నిఘా వర్గాలు సంపూర్ణంగా పనిచేసి మూలాల పైన దాడి చేయాలని భద్రాచలం ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రతి హత్యల వెనుక ఎవరి హస్తముందో సమగ్ర దర్యాప్తు నిర్వహించి వారిపైన కఠినమైన చర్యలు చేపట్టి భద్రాచలా న్ని కాపాడాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి



- గంజాయి మాఫియా పై ఉక్కు పాదం మోపాలి
- భద్రాచలం ప్రశాంతతను కాపాడుకుందాం
- సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన.

**భద్రాచలం, విశాలభారతి:**

అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం, పోలీసులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, గంజాయి మాఫియా పై ఉక్కు పాదం మోపాలని భద్రాచలం పట్టణ ప్రశాంతతను కాపాడుకుందాం అని కోరుతూ సిపిఎం, ఐద్వా భద్రాచలం పట్టణ కమిటీ ల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. భద్రాచలం పట్టణంలో బుధవారం జరిగిన హత్యాకాండను నిరసిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ భద్రాచలం పట్టణంలో ప్రశాంతత వాతావరణం నెలకొల్పేలా ప్రభుత్వం పోలీసులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి,పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి లు డిమాండ్ చేశారు. ఇంకా వారు మాట్లాడుతూ దక్షిణాయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం భద్రాచలం పట్టణంలో గత 4నెలల కాలంలో రెండు హత్యలు జరగడం, గంజాయి మత్తులో అసాంఘిక శక్తులు ప్రాబల్యం పెరుగుతుండడం దారుణమని అన్నారు. కొద్దిమంది రాజకీయ నేతల అండదండలతో చెలరేగిపోతున్న రౌడీ ముఠాలను అణచివేయడంలో ప్రభుత్వం,పోలీసు శాఖ వైఫల్యం చెందాయని విమర్శించారు. గతంలో భద్రాచలం పట్టణంలో ఎన్నడూ ఈ సంస్కృతి లేదని గత సంవత్సర కాలంగా ఈ రౌడీ మూకలు సంఘ వ్యతిరేక శక్తుల దాడులు పెరుగుతున్నాయని అన్నారు. సిపిఎం ప్రజా ప్రతినిధులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య లు ఉన్న కాలంలో ఇలాంటి శక్తులకు స్థానం లేకుండా కృషి చేశారని గుర్తు చేశారు. సిపిఎం బలంగా ఉన్న కాలంలో యువత అభ్యుదయం భావాలవైపు, సన్మార్గంలో నడిచారని నేడు సిపిఎం బలహీనపడుతున్న కాలంలో సంఘ వ్యతిరేక శక్తుల ప్రాబల్యం పెరుగుతుందని అన్నారు. సంఘ వ్యతిరేక శక్తులకు, అరాచక శక్తులకు భద్రాచలం పట్టణంలో స్థానం ఇవ్వవద్దని, భద్రాచలం పట్టణం ప్రశాంతతను కాపాడుకుందాం అని అన్నారు. బుధవారం హత్యకు గురైన సబ్జా రవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఇంకా ఐద్వా పట్టణ కార్యదర్శి డి సీతాలక్ష్మి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి ఎన్ నాగరాజు జీవనజ్యోతి కోరాడ శ్రీనివాస్ అజయ్ కుమార్ కుంజా శ్రీనివాస్ ఐద్వా నాయకులు గౌతమి, సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత సమస్యల కోసమే నేను.. దూడల సూర్య తేజ గౌడ్



**కుషాయిగూడ, విశాలభారతి:** యువకుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని దూడల సూర్యతేజ గౌడ్ అన్నారు. గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బీఆర్ఎస్వి ప్రెసిడెంట్గా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, సదాశివ, రామ్ రెడ్డి, సురేష్, నరేందర్, ధనుష్, నల్ల సందీప్, విష్ణు లు ఉన్నారు.

## ఏసీబీ వలకు చిక్కిన కారేపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



**కారేపల్లి: విశాలభారతి:** కారేపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దౌలూరి శుభకామేశ్వరి దేవి ఏసీబీ వలలో చిక్కారు. కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు పదివేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్‌గా దొరికిపోయింది. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో కారేపల్లిలోని ఆమె ఇంటి వద్ద మాటువేసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. పూర్త వివరాలు తెలియాల్సి ఉంది.

## కుంట్లూర్‌లో కేపీఎల్ సీజన్–10 ఘన ప్రారంభం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ గ్రామంలో గత తొమ్మిది సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లకు కొనసాగింపుగా ఈ ఏడాది కుంట్లూర్ ప్రీమియర్ లీగ్ (KPL) సీజన్-10ను గురువారం సిఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు.కుంట్లూర్ గ్రామ పెద్దల సహకారంతో ప్రతి ఏడాది ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా గ్రామ పెద్దలు ఒక్కొక్కరు వివిధ రూపాల్లో స్పాన్సర్లుగా ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కేపీఎల్ సీజన్-10 ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమానికి పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తాజా మాజీ చైర్పర్సన్ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.కేపీఎల్ సీజన్-10లో ప్రథమ బహుమతిగా లక్ష రూపాయల నగదు బహుమతిని చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, ద్వితీయ బహుమతిగా 50 వేల రూపాయలను బద్దం హరీష్ రెడ్డి అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఏడు జట్లు పాల్గొననున్నాయని, ఒక్కో జట్టుకు ఒక్కో స్పాన్సర్‌గా గ్రామ పెద్దలు ముందుకు రావడం క్రీడల పట్ల వారి అభిమానాన్ని చాటుతోందని తెలిపారు. అలాగే టోర్నమెంట్ నిర్వహణలో భాగంగా ప్రతిరోజూ అన్నదానానికి సహకరిస్తున్న గ్రామ పెద్దలకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ తాజా మాజీ కౌన్సిలర్ గారాల శ్రీనివాస్ గౌడ్, కందాడి సుప్రసేనారెడ్డి, శ్రీరాములు, స్థానిక గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**రాజేంద్రనగర్, విశాలభారతి:** శబరిమల మహాపాద యాత్రను ఘనంగా పూర్తిచేసుకుని వచ్చిన రమేష్ రెడ్డి గురుస్వామి, పలువురు కన్య స్వాములను గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు.



# విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**○ యువతే మాదకద్రవ్య రహిత తెలంగాణ–భారతదేశ నిర్మాణానికి కీలకం : డీఎస్పీ సైదులు**

**మొయినాబాద్, విశాలభారతి:**




విద్యార్థులు మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, యువతే మాదకద్రవ్య రహిత తెలంగాణ, భారతదేశ నిర్మాణానికి కీలక పాత్ర పోషించాలని టీజీ ఏఎన్‌బీ (తెలంగాణ రాష్ట్ర ఆంటి నార్కోటిక్ బ్యూరో) డిప్యూటీ సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ అధికారి సైదులు అన్నారు. మండల పరిధిలోని అజిత్‌నగర్ సమీపంలో ఉన్న కేఎల్హెచ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్, తెలంగాణ ప్రభుత్వ ఆంటి నార్కోటిక్ బ్యూరో, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ సైదులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్, మత్తు పదార్థాల వ్యసనం, హబ్ కల్చర్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని హెచ్చరించారు. ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఉంటుందని, ఏవైనా కేసులు నమోదైతే ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.

మాదకద్రవ్య దుర్వినియోగం వల్ల యువత విలువైన జీవితాలను కోల్పోతున్నారని, దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్, హింసాత్మక నేరాలు, పాఠశాలలు-కళాశాలలు మానేయడం వంటి సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని అన్నారు. మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఎం.పి. మల్లేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. చంద్రశేఖర్, ఫ్యాకల్టీ ఇన్‌చార్జీలు డాక్టర్ వెంకటరాజు, డాక్టర్ భవాని, డాక్టర్ దీప్తి, విద్యార్థి వాలంటీర్లు మోహన్, వైష్ణవి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరుప్పుల బీఆర్ఎస్ అడ్డ

**జిల్లా నాయకులు పల్లా సుందర్రామిరెడ్డి**



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవర్పుల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులు అల్లాహ్ సుందరరామిరెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసవ మల్లేశంసావిత్రి, చింత రవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు పల్లా సుందరామిరెడ్డి మాట్లాడుతూ, దేవరుప్పుల మండలం బీఆర్ఎస్ అడ్డా అని గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ దే పైచేయని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పాలకుర్తి నియోజకవర్గం లో సగానికి మించి సీట్లు మూడు మేజర్ గ్రామపంచాయతీలను బీఆర్ఎస్ గెలుచుకుందని, తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ మంత్రి దయాకర్ రావు, దేవరుప్పుల ప్రజల గుండెల్లో ఉన్నారని, పేర్కొంటూ ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కాబోయే కమిషనర్లకు శిక్షణ

**కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్1 గ్రూప్11 సర్వీసెస్ లలో మున్సిపల్ కమిషనర్ గా నియామకం అయినటువంటి వి.శ్రీలత ఎంసీ గ్రేడ్ 3 మరియు యస్.స్వప్న ఎంసీ గ్రేడ్ 2, లకు క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుంది.వచ్చే సమస్యలు ఏంటి? మున్సిపల్ ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా గోల్డెన్ ఫారెస్ట్ వెంచర్ లో జరుగుతున్నటువంటి రెమిడీయేషన్ చెత్త వేరు చేసే ప్రక్రియను పూర్తిగా,కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి వారికి వివరించడం జరిగింది.కస్తూరిబా పాఠశాలకు ఎదురుగా ఉన్న క్రీడా ప్రాంగణం యొక్క నవీనీకరణ పనులను వివరిస్తూ,చౌటుప్పల్ నడిబొడ్డులో ఉన్న ఊర చెరువు యొక్క సుందరీకరణ పనులను చెరువు నిండినప్పుడు పడిన ఇబ్బందులను గూర్చి వారికి వివరించడం జరిగింది.పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కార్మికుల హాజరు,సిబ్బందిని వార్డులకు కేటాయింపు,వారి పనితీరును పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ఓ అంజయ్య,ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్,జవాన్లు అంజయ్య,నరసింహ,పారిశుధ్య కార్మికులు పాల్గొనడం జరిగింది.

## చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి


**○ రోడ్లపై చెత్త పారవేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి**
**○ కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ , విశాలభారతి:** నిజామాబాద్, డిసెంబరఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్త పారవేయకుండా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఎల్లమ్మగుట్ట రైల్వే కమాన్ సమీపంలో, గాయత్రీనగర్ లో ప్రధాన కూడళ్ళ వద్ద రోడ్ల పక్కన చెత్త పారవేయకుండా చేపట్టిన చర్యలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాలలోనే చెత్తను వేయాలని, రోడ్లపై చెత్త పారవేస్తే జరిమానాలు విధించబడతాయనే విషయాన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లు, మైకుల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలలో అవగాహన పెంపొందించాలని అన్నారు. పారిశుధ్య సమస్య నెలకొనకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించేలా చూడాలన్నారు. మురుగు కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తూ, ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అవకాశం ఉన్న చోట జె.సీ.బీ యంత్రాల ద్వారా మురుగు కాలువలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి, పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిగా మొక్కలు నాటించి వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టర్ నాగారం శివారులోని డంపింగ్ యార్డును సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మరో రెండు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాలను సత్వరమే తెప్పించుకుని శుద్ధి ప్రక్రియ ప్రారంభం అయ్యేలా చూడాలని కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటి కమిషనర్ రవిబాబు, ఇంచార్జీ ఎం.హెచ్.ఓ సాజిద్ తదితరులు ఉన్నారు.

## గ్రామ ప్రజలందరికీ నా ధన్యవాదములు

**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాపై నమ్మకంతో గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పేరు ప్రకటించిన పాలకుర్తి శాసనసభ్యులు యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి గారికి, సింగరాజుపల్లి గ్రామ ప్రజలందరికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ప్రత్యేక ధన్యవాదాలు.అదే విదంగా మా మీద నమ్మకం ఉంచి సర్పంచ్ గా గెలిపించిన గ్రామ ప్రజలందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు, ఎన్నికల్లో నాకు అండగా నిలిచిన వివిధ వర్గాల నాయకులకు,యువతి యువకులకు మహిళలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా మా యొక్క ధన్యవాదాలు. మీ ప్రేమ అనురాగం ,ఆప్యాయత ఆదరాభిమానంతో మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించి మీ విలువైన ఓటును నాకు కేటాయించిన మా గుర్తు పై ఓటు వేసి నా గెలుపు కొరకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.నాపై మీ ప్రేమానురాగాలు, ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ అనునిత్యం ఇలాగే కొనసాగాలని, గ్రామ అభివృద్ధి కొరకు కంకణ బద్ధుడై ఉంటానని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.



## ఆర్మీ జవాన్ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన టీఆర్ఆర్



**○ ఆర్మీ జవాన్ శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటానన్న ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి**
**○ ఆర్మీ జవాన్ శ్రీనివాస్ మరణం దేశానికి తీరని లోటు**

**పరిగి, విశాలభారతి:**

దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తోకని శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందడం పట్ల పరిగి శాసనసభ్యులు డా. టి. రామ్మోహన్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఈరోజు శ్రీనివాస్ నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, ఈ కష్టసమయంలో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కుటుంబ అవసరాల నిమిత్తం తక్షణ ఆర్థిక సహాయం అందించారు. అలాగే శ్రీనివాస్ సోదరుడికి ప్రభుత్వ పరంగా ఉద్యోగం లేదా ఉపాధి కల్పించే దిశగా తగిన సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టంగా హామీ ఇచ్చారు. దేశ రక్షణకు సేవలందించిన జవాన్ అకాల మరణం తీరని లోటని, ఆయన దేశానికి అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్మీ అధికారులతో మాట్లాడి మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. ఆర్మీ జవాన్ శ్రీనివాస్ మరణంతో దాదాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఎమ్మెల్యే వీ.నవీన్ యాదవ్‌కు ఘన సన్మానించిన సినీ కార్మికులు



**గండిపేట్ విశాలభారతి :**

హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచిన వీ .నవీన్ యాదవ్ కు చిత్రపురి కాలనీవాసులు,సినీ కార్మికులు మధ్య అనిల్ కుమార్ వల్లభనేని(అధ్యక్షులు తెలుగు ఫిలిం ఎంప్లాయిస్ యూనియన్, మాజీ అధ్యక్షులు చిత్రపురి కాలనీ,తెలుగు సినీ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ సెక్రటరీ) ఆధ్వర్యంలో పీఎస్.దొర (మాజీ అధ్యక్షులు తెలుగు సినీ మేనేజర్స్ యూనియన్,చిత్రపురి కాలనీ మాజీ సెక్రెటరీ,తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఫెడరేషన్ మాజీ సెక్రెటరీ) సమక్షంలో వల్లభనేని హైమాంజలి అనిల్ కుమార్(మాజీ కౌన్సిలర్ మణికొండ మున్సిపాలిటీ) పర్యవేక్షణలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ హాజరయ్యారు.ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే వీ.నవీన్ యాదవ్ కు గజమాలతో ఘనంగా సన్మానం జరిపారు.ఈ కార్యక్రమంలో వి.చిన్న శ్రీశైలం యాదవ్, వీ.వెంకట్ యాదవ్, అనిల్ కుమార్ వల్లభనేని, చిత్రపురి కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అవడం చిన్న విషయం కాదని, చిన్న వయసులోనే ఎమ్మెల్యే అయిన వి.నవీన్ యాదవ్ కు అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షులు అనిల్ కుమార్ వల్లభనేని మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీ.నవీన్ యాదవ్ భారీ మెజారిటీ గెలుపులో చిత్రపురి కుటుంబ సభ్యులు భాగం కావడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన చిత్రపురి కాలనీ కుటుంబ సభ్యులకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. అతిరధ మహారధుల నడుమ ఈ కార్యక్రమం పండగలా సాగింది. ఈ కార్యక్రమంలో చిత్రపురి కమిటీ మెంబర్స్ టి.లలిత, కొంగర రామకృష్ణ ప్రసాద్, అలహరి బత్తుల రఘు, వేణుగోపాలరావు,డి.రమేష్‌బాబు, అనిత నిమ్మగడ్డ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలోని ప్రతి సమస్యను బాధ్యతగా పరిష్కరిస్తా

**○ పెద్ద కొండూరు గ్రామ ప్రజలకు ధన్యవాదములు**
**○ సర్పంచ్ గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని పెద్దకొండూర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ,సిపిఎం పార్టీ బలపరిచిన బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి గ్రామ సర్పంచ్ గా భారీ మెజారిటీతో విజయం సాధించిండం జరిగినది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద కొండూరు గ్రామ ప్రజలకు నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించడం ఆనందంగా ఉంది అని గుండెబోయిన శిరీష ఇస్తారి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామ సమస్యలపై నిత్యం అందుబాటులో ఉంటానని, గ్రామ సమస్యలు నా సమస్యగా భావిస్తానని,బాధ్యతగా పరిష్కరిస్తానని వారు అన్నారు.నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన పెద్దకొండూర్ గ్రామపంచాయతీ ప్రజలందరకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిపిఎం పార్టీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామచంద్ర పల్లె సర్పంచ్‌గా భూషణ్



**నిజామాబాద్, విశాలభారతి:** ఆలూరు మండలంలోని రాం చంద్రాపల్లి గ్రామ సర్పంచ్ గా 400 ఓట్ల మెజారిటీ తో గెలపొందారు. సర్పంచ్ భూషణ్ రాంచంద్ర పల్లి గ్రామ ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా సమానంగా చూస్తానని అందరూ నా వాళ్ళే అనుకొని నా గ్రామ అభివృద్దె ధ్యేయంగా పనిచేస్తానని ఆయన వ్యక్తం చేశారు .నన్ను గెలిపించిన నా ఊరు ప్రజలకు ఎల్లవేళలా పని చేస్తారని ఆయన తెలిపారు. భూషణ్ తనను గెలియించిన గ్రామ ప్రజలకు శుభకాంక్షలు ,ధన్యవాదములు తెలిపారు.

## గుత్ప సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన కొండ్ర కమల దశరథ్



**నిజామాబాద్, విశాలభారతి:** ఆలూరు మండలంలోని గుత్ప గ్రామ సర్పంచ్ గా. 635 ఓట్ల తోని గెలపొందారు. సర్పంచ్ సభ్యురాలు.. కొండ్ర కమలా దశరథ్ బలపరిచిన వ్యక్తులే గెలిచారు గుత్ప గ్రామ ప్రజలందరికీ అయినా సంక్షేమ పథకాలు అందరికి దైవ సమానంగా చూస్తానని అందరూ నా వాళ్ళే అనుకొని నా గ్రామం నా విలేజ్ అని ఆయన వ్యక్తం చేశారు .నేను గెలవడం గెలిపించిన నా ఊరు ప్రజలకు ఎన్ని వేల పని చేస్తారని ఆయన కోరారు కొండ్ర కమల దశరథ్ గ్రామ ప్రజలకు శుభకాంక్షలు ధన్యవాదములు తెలిపారు.

## ఎన్టీఆర్ కాలనీ రోడ్డు సమస్య పరిష్కరించాలి




**నిజామాబాద్, విశాలభారతి:** ఆర్మూర్ పట్టణ ఎన్టీఆర్ కాలనీ లోకి వాహనాలు రాకపోకలు వెళ్లకుండా ఆర్టీసీ అధికారులు రోడ్డు ను మూసి వేస్తున్నారని కాలనీవాసులు రోడ్డుకు అడ్డంగా టెంట్ వేసుకుని ఆర్టీసీ అధికారులకు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఎన్టీఆర్ నగర్ కాలనీ వద్దకు చేరుకొని కాలనీవాసుల సమస్యలు తెలుసుకుని ఆర్టీసీ అధికారులకు చరవాణి ద్వారా సమాచారం అందించి ఎన్టీఆర్ కాలనీకి రాకపోకలకు ఇబ్బందులు కలిగించకూడదని తెలిపారు. కాలో నీ వాసులు ధర్నా ను విరమించరూ.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్. పవన్. విజయ్ . భూపేందర్ నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## నూతనంగా నియమితులైన చైర్మన్ కృష్ణకు సన్మానం

సికింద్రాబాద్, విశాల భారతి : చిలకలగూడ కట్ట మైసమ్మ దేవాలయం చైర్మన్ గా గుంటి కృష్ణ ని రెండవ సారి రాష్ట్ర దేవాదాయశాఖ నియమించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఫాంహౌస్ వేడుకలకు అనుమతులు తప్పనిసరి

**○ నిబంధనలు ఉల్లంఘిస్తే యజమానులపైనా కేసులు : డీసీపీ యోగేష్ గౌతం**

**మొయినాబాద్, విశాలభారతి:**

ఫాంహౌస్‌లలో నిర్వహించే డిసెంబర్ 31 వేడుకలతో పాటు ఏ ఇతర కార్యక్రమాలకైనా పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతం స్పష్టం చేశారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో ఫాంహౌస్ యజమానులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఫాంహౌస్‌లలో వేడుకలు నిర్వహించే సమయంలో లిక్కర్ వినియోగం ఉంటే ఎక్సైజ్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. పార్టీల నిర్వహణకు ముందు ఫాంహౌస్‌కు వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఫాంహౌస్‌లో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అలా చేయకపోతే సంఘటనకు కారణమైన వారితో పాటు యజమానులు, నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, ఎస్సైలు నర్సింహారావు, వెంకన్న, నయిమొద్దీన్, పోలీసు సిబ్బంది, ఫాంహౌస్ నిర్వాహకులు పాల్గొన్నారు.



# స్వతంత్ర అభ్యర్థులు, ఎటువైపు?

- రెబల్ గా నిలబడ్డ వారికి పార్టీలో అవకాశం?
- స్వతంత్రుల చూపు ఎటువైపో ?
- ఎవరి ఖాతాలో వారే వేసుకుంటున్న వైనం
- గ్రామాల అభివృద్ధి ముఖ్యమా... పార్టీలు ముఖ్యమా?
- ఎటూ తేల్చుకోలేక పోతున్న రెబల్, స్వాతంత్రులు

**కోదాడ, విశాలాభారతి:**

కోదాడ నియోజకవర్గం వ్యాప్తంగా తొలి, రెండవ, మూడవ విడతల్లో గెలిచిన స్వతంత్ర, రెబల్ అభ్యర్థులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అదినాయకులు వలవేస్తున్నారు. కొన్ని గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యక్షంగా మద్దతు తెలిపి గెలుపుకు కృషి చేశారు. మరి కొన్ని గ్రామాలలో తాను ఏ పార్టీ నాయకున్ని కాదు స్వతంత్ర అభ్యర్థిని అంటూ ప్రకటించుకొని అన్ని పార్టీల మద్దతు కూడగట్టుకొని గెలుపొందారు. గెలిచే వరకు బాగానే ఉన్న ఫలితాలు వెలువడ్డాక పార్టీల నుంచి వస్తున్న ఒత్తిడులను తట్టుకోలేక అన్ని పార్టీల అధినాయకులను కలుస్తూ అభినందనలు పొందుతున్నారు. అదే అవకాశాన్ని అదునుగా చేసుకొని ఆ పార్టీ కండువాలు కప్పుకొని సుమా అనిపిస్తున్నారు. దాంతో ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారిందని చర్చిసుకుంటున్నారు. కోదాడ నియోజకవర్గంలో ఓ గ్రామ సర్పంచు కాంగ్రెస్ పార్టీ నాయకులు కండువా కప్పి వారి జాబితాలో జత చేసుకున్నారు. రాత్రికి రాత్రి రాజకీయ ప్రతినిధులను కలవగా కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపి సర్పంచ్ పదవి వారి వారి పార్టీ ఖాతాలో వేసుకుంటున్నారు. చాలా గ్రామాలలో సర్పంచ్, వారు సభ్యులుగా గెలుపొందిన స్వతంత్ర, రెబల్స్ అభ్యర్థులకు తమ పార్టీలోకి రావాలంటూ ఆహ్వానాలు పలుకుతున్నారు. తమ పార్టీ అభ్యర్థి అంటూ వారికి డిమాండ్ భారీగా పలుకుతుందని చెప్పవచ్చు. మరి కొన్ని గ్రామాలలో సర్పంచ్ ఏ పార్టీ అభ్యర్థి అయితే వార్డు సభ్యులు పార్టీలో చేరేందుకు రెడీ అవుతున్నారు.

**అభివృద్ధా కోసమా...పార్టీ కోసమా?**

తొలి, రెండవ, మూడవ విడత పంచాయతీ ఎన్నికలు ముగిసిపోయాయి. అయితే మూడు విడతల్లో గెలుపొందిన స్వతంత్రులతో పాటు ఆయా పార్టీల రెబల్స్ అభ్యర్థులు అభివృద్ధా లేక పార్టీనా అనే సందిగ్ధంలో పడ్డారు. మరోవైపు బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా గెలుపొందిన వారు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరితే గ్రామాభివృద్ధికి నిధులు సమీకరించుకోవచ్చనే ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు సర్పంచ్లు సొంత పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా గెలిచిన వారు కండీషన్ల మీద తిరిగి పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలావుండగా ఏ పార్టీకి సంబంధం లేకుండా గెలిచిన స్వతంత్ర అభ్యర్థులకు మాత్రం డిమాండ్ బాగానే ఉంది తమ పార్టీలో చేరాలంటే తమ పార్టీలో చేరాలని స్థానిక నేతలు ఒత్తడి తీసుకువస్తున్నారు. గ్రామాల అభివృద్ధికై నిధులు ముఖ్యమనే భావనలో కొందరు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ నెల జరిగే ప్రమాణ స్వీకారోత్సవాల నాటికి లేదా తర్వాతైనా ఏదో ఒక పార్టీ కండువా కప్పుకునే అవకాశం ఉందనేది వినిపిస్తుంది.

## తన విగ్రహాన్ని తానే ఏర్పాటు చేసుకున్న రైతు బిడ్డ

**89 ఏళ్ల వయసులోనూ వ్యవసాయంపై అపార మమకారం – కళ్లెం నర్సింహా రెడ్డి**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలం లోని చిలుకూరు రెవెన్యూలో 89 ఏళ్ల వయసులోనూ వ్యవసాయంపై అపారమైన మమకారంతో జీవితం సాగిస్తున్న అరుదైన రైతు కళ్లెం నర్సింహా రెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. తెలంగాణ పల్లె నుంచి అమెరికా వరకు తన వ్యవసాయ ప్రతిభతో గుర్తింపు పొందిన ఆయన, తాజాగా తన భార్యతో పాటు తన విగ్రహాన్ని స్వయంగా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రత్యేక ఆకర్షణగా మారారు. మూడుదశాబ్దాల పాటు అమెరికాలో నివసించిన కళ్లెం నర్సింహా రెడ్డి అక్కడ కూడా వ్యవసాయాన్ని వృత్తిగా చేసుకుని, ఐదువేల ఎకరాల భూమిని లీజుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగు చేసి రికార్డు సృష్టించారు. ఈ కృషికి గుర్తింపుగా అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డును కూడా అందుకున్నారు. తర్వాత మాతృభూమిపై మమకారంతో తెలంగాణకు తిరిగివచ్చిన ఆయన, చిలుకూరు సమీపంలో తన పేరుతో వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆధునిక సాగు పద్ధతులతో పాటు ప్రకృతితో మమేకమై జీవితం గడుపుతున్న నర్సింహా రెడ్డి, ఈ వయసులోనూ వ్యవసాయ పనులన్నీ స్వయంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆయన తన వ్యవసాయ క్షేత్రంలో భార్య కళ్లెం లక్ష్మి విగ్రహంతో పాటు తన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. భార్య ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం (డిసెంబర్ 19) ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. భార్యపై ఉన్న ప్రేమతో రాజస్థాన్‌లో విగ్రహాలను తయారు చేయించుకున్న ఆయన, ఆమె ఒంటరిగా నిలవకూడదనే భావనతో తన విగ్రహాన్ని కూడా పక్కనే ఏర్పాటు చేశారు. ఈ రెండు విగ్రహాలను కళ్లెం నర్సింహా రెడ్డి స్వయంగా ఆవిష్కరించనుండడం విశేషంగా నిలుస్తోంది.

## నూతన సర్పంచ్ ను సన్మానించిన ఎమ్మెల్యే రామారావు పటేల్



**భైంసా , విశాలభారతి:** ముధోల్ నియోజకవర్గంలోని బాసర మండల పరిధిలో ఓని గ్రామానికి చెందిన జగదీష్ పటేల్ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా గెలిచిన శుభ సందర్భంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ స్వగ్రాంలోని పార్టీ కార్యాలయంలో ముందుగా ఎమ్మెల్యేను నూతన సర్పంచ్ జగదీష్ పటేల్ తమ అనుచర బృందంతో పూలమాల బొకే అందించి మిఠాయి తినిపించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామంలో నెలకొన్న ప్రతి సమస్యను అందరూ గుణమతభేదం లేకుండా తారతమ్యంగా అందరి పట్ల కలిసిమెలిసి ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా పనులు చేయాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జగదీష్ పటేల్ ను శాలువాతో సత్కరించారు. వీరి వెంట ఉప సర్పంచ్ పురుషోత్తం, కాలేవా రాము జాదవ్, కిసాన్ పటేల్, ఆనందరావు, సంతోష్, భీమ్రావు, జగదీష్ పటేల్ యొక్క అనుచరులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## పట్టణంలో నెలకొన్న సమస్యలపై మున్సిపాలిటీ డిఈ కి వినతి



**భైంసా, విశాలభారతి:** భైంసా పట్టణంలోని పలు సమస్యలు గురించి మున్సిపల్ (డి ఈ) సంతోష్‌కుమార్ కు గురువారంవినతి పత్రం ఇవ్వడం జరిగింది అదేవిధంగా కిసాన్ గల్లి లోని 14 వార్డు 15 వార్డు 1 వార్డు లొ మిషన్ భగీరథ వాటర్ లీకేజ్ అయి రోడ్లపై పారుతున్నాయి ఎల్ల గౌడ్, ఇంటి ముందర నుంచి మన గల్లీ పోలీస్ స్టేషన్ వరకు వాటర్ లీకేజీ అయి ప్రజలు చాలా ఇబ్బంది గురవుతున్నారు ఆ సమస్య నా వరకు తీసుకురావడంతో సమస్యను మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా 14 వార్డు లోని కిసాన్ గల్లీలోని హల్దా లాస్మన్న ఇంటి ముందరి కల్వర్టు డామేజ్ కావడంతో అక్కడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. అదే విధంగా 1 వార్డ్ గట్టు మైసమ్మ గల్లి లొ కల్వర్టు పాడే బాగా రోజులై ప్రజలు ఇబ్బంది జరుగుతున్నారు ఆ సమస్యను నా వరకు తీసుకురావడంతో మున్సిపాలిటీలో సమస్యను వివరించారు. వారు ఈ సమస్యలన్నింటిని రెండు లేదా మూడు రోజులలో పరిష్కరిస్తామని తెలియజేశారు. రావుల రాము, కె.భూ కిరణ్, బోల్మెట్టి రాకేష్, ముల్లా వార్ అనిల్, పల్సి పండరి సమస్యలను వివరించడం జరిగింది.

## డాక్టరేట్ పట్ట పొందిన గజ్జరి శంకరును అభినందించిన త్రిబుల్ ఐటీ వి సి



**బాసర , విశాలభారతి:** ఆర్జీయూకేటీ అంగ్ల విభాగం లో సహాయాచార్యుడుగా పని చేస్తున్న గుజ్జరి శంకర్, తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మనోజ పర్యవేక్షణలో "ఎ క్రిటికల్ స్టడీ ఆన్ మేజర్ థీంస్ అండ్ ఇష్యూస్ ఇన్ ద సెలక్టెడ్ నావెల్స్ ఆఫ్ చేతన్ భగత్" అనే అంశం మీద పరిశోధన గ్రంథాన్ని సమర్పించి పి.ఎచ్.డి పట్టాని పొందడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టరేట్ పట్టాని సాధించిన గుజ్జరి శంకర్ ని ఉపకులపతి, ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డి ప్రొఫెసర్ మురళి దర్షన్ , డీన్ డా". ఎస్. విఠల్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## సర్పంచ్‌ల ఫోరం తూప్రాన్ మండల అధ్యక్షులుగా పంజాల ఆంజనేయులు గౌడ్



**తూప్రాన్, విశాలభారతి:** సర్పంచ్ ల ఫోరం తూప్రాన్ మండల అధ్యక్షులుగా మల్కాపూర్ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ ను బి.ఆర్.ఎస్ పార్టీ సర్పంచ్ లు బి.హరిష్ గౌడ్ వెంకటాయపల్లి, పి. అంజనేయులు గౌడ్ మల్కాపూర్, బాస్కర్ నాయక్ నర్సంపల్లి, కంకణాల నాగమణి కొనాయిపల్లి పిబి, కే. బాగ్యలక్ష్మి వెంకట రత్నపూర్, ఆకుల శ్రీనివాస్ వట్టూర్ లు కలిసి మొత్తం ఏడుగురు సర్పంచ్ లు కలసి మల్కాపూర్ సర్పంచ్ పంజాల అంజనేయులు గౌడ్ ని తూప్రాన్ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు గా ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం తూప్రాన్ మండలం సర్పంచ్లల పోరం ఉపాద్యక్షులుగా వట్టూరు గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ను ఎకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ రాబోయే రెండేళ్ల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బి.అర్.ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

## దేశ వ్యతిరేక విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి




- జీవిత బీమా ఉద్యోగుల సంఘం నిరసన కార్యక్రమం

**చౌటుప్పల్, విశాలభారతి:**

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్ డి ఐ) పరిమితిని 100 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఏఐఐఈఏ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.నేడు చౌటుప్పల్ శాఖ ఎల్ఐసీ కార్యాలయంలో భోజన విరామ సమయమునందు ఐసీఈయు బీమా రంగ ఉద్యోగుల సంఘం,చౌటుప్పల్ తరఫున వారు నిరసన ప్రదర్శన జరిపారు.ఈ కార్యక్రమంలో 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తున్న ప్రభుత్వ నిర్ణయం వల్ల కలిగే ముప్పులను నేతలు వివరించారు.విఫలమైన ఎఫ్‌డీఐ నమూనా 2000 సంవత్సరంలో బీమా వ్యాప్తి 3% ఉండగా,ఎఫ్‌డీఐని విడతలవారీగా 74%కి పెంచినా ప్రస్తుతం అది 3.5% వద్దే ఉంది. పెట్టుబడులు పెరిగితే బీమా వ్యాప్తి పెరుగుతుందనే వాదన అబద్ధమని తేలిపోయింది.ప్రజల పొదుపుపై విదేశీ పెత్తనం 100శాతం ఎఫ్‌డీఐ వల్ల భారతీయులు కష్టపడి దాచుకున్న సేవింగ్స్‌పై విదేశీ కంపెనీలకు పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఇది దేశ ఆర్థిక సార్వభౌమాధికారానికి ప్రమాదకరం.లాభమే పరమావధి విదేశీ సంస్థలు కేవలం కార్పొరేట్ లాభాల కోసమే పనిచేస్తాయి తప్ప, పేద మరియు మధ్యతరగతి ప్రజల భద్రతను పట్టించుకోవు.కావున బీమా రంగం ప్రజల కొనుగోలు శక్తిపై ఆధారపడి ఉంటుంది,కానీ విదేశీ నిధులతో కాదు.ఈ దేశ వ్యతిరేక విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని సంఘం అధ్యక్షులు కా.ఏ.రమేష్ డిమాండ్ చేసారు. ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టే ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని ఈ సందర్భంగా చౌటుప్పల్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి కా.జి.భాస్కర్ రాజు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో చౌటుప్పల్ శాఖకు చెందిన కా సోమశేఖర్,కా. రాము,కా.రాకేష్,కా.అరుణ,కా.లత,కా.శ్రీదేవి,కా. గణేష్,కా.ధనుష్,కా.రామకృష్ణ, కా సత్యనారాయణ,కా.మధు, కా.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చాం మార్పు మొదలైంది



- ప్రజల దాహార్తి తీర్చేందుకే నూతన బోరు
- సర్పంచ్ ఎం రామేశ్వర్

**విశాలభారతి, మర్పల్లి:**

అధికారం కంటే సేవకే మొదటి ప్రాధాన్యత అని మాట ఇచ్చాం అవి చేతల్లో చేసి చూపించడమే లక్ష్యమని మర్పల్లి సర్పంచ్ మదుగు రామేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పదవ వార్డులో స్థానిక నాయకులతో కలిసి నూతన బోర్ ను వేయించారు. గ్రామంలో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. మాట ఇచ్చి మరచిపోయే నాయకుడిని కాదని ఇచ్చిన మాట కోసం కట్టుబడి ఉంటానన్నారు. ప్రజా సేవ చేసేందుకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాన్ని ఇలాంటి సమస్యలు లేకుండా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. నా గెలుపులో కీలక పాత్ర పోషించిన నాయకులకు నా వెంటే ఉండి నన్ను ముందుకు నడిపించిన వారందరికీ రుణపడి ఉంటానని గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేరుగా నా తలుపు తట్టవచ్చని గ్రామంలోని ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అధిక నిధులు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొప్పుల ప్రభు, మాజీ ఎంపీటీసీ శేఖర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతుగారి మధుసూదన్ రెడ్డి, నరసింహులు యాదవ్, దివాకర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు మహిళలు పాల్గొన్నారు.

## జేఎన్ టియుహెచ్ యూనివర్సిటీ కోచ్‌గా మోక్తాల నరసింహ నియామకం




- శ్రీ ఇందు కళాశాల నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపిక
- కోచ్ నియామకం పట్ల శ్రీ ఇందు యాజమాన్యం హర్షం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఉమెన్ మహిళల వాలీబాల్ కోచ్ మరియు మేనేజర్ గా మోక్తాల నరసింహ నియామకం అయ్యారు. ఈనెల 15 నుండి 19 వరకు తమిళనాడులో ని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ 2025 __ 26 వాలీబాల్ ఉమెన్ టోర్నమెంట్ కు మోక్తాల నర్సింహ ను జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ హైదరాబాద్ మహిళల వాలీబాల్ జట్టుకు కోచ్ , మేనేజర్ గా నియామకం అయ్యాడు. శ్రీ ఇందు కళాశాల విద్యార్థులు స్వాత్విక , కావ్య శ్రీ లు ఈ వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొన్నారు. కోచ్ నర్సింహ శ్రీ ఇందు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇబ్రాహీంపట్నంలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయన నియకంపట్ల కళాశాల యాజమాన్యం ఆర్ వెంకట్ రావు చైర్మన్ , ప్రిన్సిపల్, అధ్యాపకులతో పాటు క్రీడాభిమానులు అతనికి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వార్డు సభ్యుడు



**కేశంపేట, విశాలభారతి:** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.గురువారం మండల పరిధిలోని లేమామిడి గ్రామ 9వ వార్డు సభ్యుడు అల్వాల వినోద్ కుమార్ తోపాటు ఇతర బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, అలాగే ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించారన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. లేమామిడి పంచాయతీలోని తుర్కలపల్లి గ్రామానికి 25 లక్షల రూపాయల వ్యయంతో మహిళా సంఘం భవనం కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తక్షణమే 25 ఇండ్లను కేటాయిస్తున్నట్లు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ వీరేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కర్ణాకర్, భాస్కర్ గౌడ్, గ్రామస్తులు రఘుపతి,ప్రకాష్ గౌడ్,గోపాల్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,శ్రీహరి గౌడ్,అశోక్ గౌడ్,అరవింద్ గౌడ్,రాజేంధర్ గౌడ్,నరేష్ గౌడ్,కిరణ్,దేవేందర్,విశాల్,సంపంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట చెరువులో మలమూత్ర వ్యర్థాలు వదిలే యత్నం

**సెప్టిక్ ట్యాంకర్‌ను పట్టుకున్న పోలీసులు – కేసు నమోదు**




**మొయినాబాద్, విశాలభారతి:** ప్రాణాలను కాపాడే ప్రకృతినే కలుషితం చేయడానికి కొంతమంది స్వార్థపరులు పాల్పడుతున్న దారుణ చర్యలకు గండిపేట చెరువు తాజా ఉదాహరణగా నిలిచింది. గండిపేట వాసుల దాహార్తిని తీర్చే ఉస్మాన్ సాగర్ (గండిపేట) చెరువులో సెప్టిక్ ట్యాంకర్ ద్వారా మలమూత్ర వ్యర్థాలను వదిలే ప్రయత్నం జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బుధవారం సింగరేణి కాలనీ, సైదాబాద్‌కు చెందిన శివ అనే వ్యక్తి సెప్టిక్ ట్యాంకర్ ద్వారా చెరువులో మలమూత్ర వ్యర్థాలను వదిలే ప్రయత్నం చేస్తున్నట్లు స్థానికులు గమనించారు. వెంటనే వారు వాటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన వాటర్ బోర్డు అధికారులు పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హిమాయత్‌నగర్ గ్రామ పరిధిలోని ఎఫ్టీఎల్ పాయింట్ నెంబర్-428 వద్ద ఉన్న ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్‌లో సెప్టిక్ ట్యాంకర్ ద్వారా వ్యర్థాలు వదులుతున్న సమయంలో శివను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తాగునీటి వనరుల కాలుష్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## అందరి సహకారంతో ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికలు

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్, విశాలభారతి:** అందరి సహకారంతో జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లాలో మూడు విడతలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు సాఫీగా ముగిసిన నేపథ్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను, ఇతర నోడల్ అధికారులను జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ రావు సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో కృషి చేసిన ఫలితంగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకోగలిగామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోనూ ఇదే తరహాలో సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సర్పంచులను సన్మానించిన చల్లా ధర్మారెడ్డి

**పరకాల , విశాలభారతి:** పరకాల, నడికుడ, ఆత్మకూరు, దామెర మండలాల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరచగా గెలుపొందిన నూతన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను హన్మకొండలోని వారి నివాసంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చల్లా ధర్మారెడ్డిని కలిసిన వారిలో ఉప సర్పంచులు,వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.





# విలన్ పాత్రపై కాంతార బ్యూటీ
# రుక్మిణి వసంత్

రిషబ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా ప్రాజెక్ట్ కాంతార చాప్టర్ 1 (ప్రీక్వెల్). 2025లో అత్యధిక గ్రాస్ సాధించిన భారతీయ సినిమాగా నిలిచింది. గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.800 కోట్లు లైఫ్ టైం వసూళ్లు రాబట్టి.. సెకండ్ హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన కన్నడ సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. కాగా ప్రీక్వెల్‌లో ఎవరూ ఊహించని విధంగా రుక్మిణి వసంత్ విలన్ రోల్‌లో కనిపిస్తుంది. చాలా మంది ఈ రోల్ చూసి షాకయ్యారు. అయితే విలన్ పాత్ర గురించి తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయం షేర్ చేసింది రుక్మిణి వసంత్ . నా కెరీర్ తొలినాళ్లలోనే కాంతార చాప్టర్ 1లో నేను విలన్ పాత్రలో నటించడం చాలా ప్రమాదకర ప్రయోగం. దీంతో ఇక నేను జీవితంలో మిగిలిన టైం అంతా విలన్ పాత్రల్లో నటిస్తానేమోనని ఆశ్చర్యపోయా. నేను నెగెటివ్ రోల్ పోషించడాన్ని జనాలు ప్రేమించారు.. వాళ్లు నన్ను అసహ్యించుకోలేదు. అందువల్లే సినిమా ఎలా ఆడుతుందో ఆలోచిస్తూ నేను భయపడాల్సిన అవసరం లేదంది. ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు అది గొప్ప విషయమంటూ చెప్పకొచ్చింది రుక్మిణి వసంత్. ఇప్పడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. రుక్మిణి వసంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది. వీటిలో రెండు భారీ బడ్జెట్ సినిమాలే కావడం విశేషం. వీటిలో ఒకటి కేజీఎఫ్ స్టార్ యశ్ నటిస్తోన్న టాక్సిక్ కాగా.. మరొకటి ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ నటిస్తోన్న డ్రాగన్. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న స్టార్ హీరో సినిమాలే కావడంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.